

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 98 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 01, మార్చి 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్







# పెత్తనాలు ఇంకెంతకాలం

## ఆంధ్ర జర్నలిజం తెలంగాణలో పెత్తనం సహించలేనిది

మోస్ట్ సీనియర్ జర్నలిస్టులు అంటే మాకు ఎప్పుడు గౌరవమే

ప్రజా సేవ చేస్తున్న జర్నలిస్టుల ప్రయాసను గౌరవించాలి

వృత్తిలో గౌరవం వ్యక్తిత్వాన్ని,పనితనాన్ని బట్టి వస్తుంది

సమాజానికి జవాబుదారులందరు ఆదిపత్యం కోసం ఆరాట పడుతున్నారు

పక్షపాత జర్నలిజం రాజకీయ ఆధిపత్యం లాంటిది

సభ్యత్వపు అవకాశాలలో కక్షగడుతున్నారు

కష్టాన్ని బట్టి గౌరవించాలి గాని పైరవీలను బట్టి అవకాశాలు కల్పించొద్దు

ప్రెస్ క్లబ్స్ సభ్యత్వ ఆధారాలను బహిరంగపరచాలి

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

నిజాయితీని నిర్భయంగా రాయలేని పెద్దలు జర్నలిజంలో పెత్తనం చేస్తున్నారని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుదారులుగా ఉంటున్నామంటూ జర్నలిజంలో పెత్తనం చేస్తున్నారన్నారు. ఆధిపత్య పోరు రాజకీయం లాంటిదని దానిని ప్రజలకు జవాబుదారిగా వ్యవహరిస్తున్న జర్నలిజానికి ఏమాత్రం రుద్దొద్దన్నారు.సమాజ సంక్షేమం కోసం నిజాయితీగా పాటుపడే జర్నలిస్టులకు సముచిత స్థానం కేటాయించాలన్నారు. మనమంతా ప్రభుత్వానికి ప్రజలకు వారదులం అనే సంగతిని మర్చిపోయి ప్రెస్ క్లబ్స్ నియమాలంటూ నిజాయితీగా పని చేసే వారిని అవమాన పరుస్తున్నారన్నారు. పెట్టుబడిదారీ వ్యాపారంలా కాకుండా నిజాయితీగా పని చేయడంలో ఎంతో గర్వం దాగి ఉంటుందన్నారు.ఎవరితో సంబంధం లేకుండా ప్రజాసేవలో దూసుకుపోతున్న సీఎం రేవంత్ రెడ్డి పై వ్యతిరేక దుష్ప్రచారం చేయడంలో జర్నలిజం పాత్ర కూడా లేకపోలేదని గత పది సంవత్సరాలుగా యేల్లో మీడియా పేరు మీద 75శాతం మీడియా ప్రభుత్వానికి అమ్ముడుపోయి తెలంగాణ రాష్ట్రాన్ని పతనం చేసింది అన్నారు.ప్రెస్ క్లబ్స్ సభ్యత్వ నమోదు ఆధారాల ప్రకారం ఆంధ్రకు సంబంధించిన పెద్ద మనుషులే తెలంగాణ ప్రెస్ క్లబ్ ను శాసిస్తున్నారని మేధావులు భావిస్తున్నట్లు పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వంలో నిజాయితీగా శ్రమ పడుతూ ప్రభుత్వ పనితనాన్ని ప్రజలకు తెలియజేయడంలో కొంత శాతం జర్నలిజం నామూషిగా ఫీల్ అవుతున్నారన్నారు. ఆధారాలతో కూడిన నిజాయితీ ఎప్పుడు దాగుండేది కాదన్నారు. కొత్త వాళ్లకు అవకాశాలు కల్పించడం యువకులను ప్రోత్సహించడం జర్నలిజంలో భాగమైనప్పుడు ఆటంకాలు సృష్టిస్తూ అభ్యంతరాలను కల్పిస్తూ పెద్దమనుషుల్లా చెలామని అవుతామనుకోవడం సరైనది కాదన్నారు.ఆంక్షలు ఎక్కడైనా ఉంటాయి కానీ కష్టపడే వ్యక్తిత్వానికి దేనితో పని లేదన్నారు.పెత్తనం చేయాలనుకుంటే శుభ్రంగా రాజకీయాల్లో చేరిపోవడం మంచిది అన్నారు. ప్రధానంగా రాష్ట్రాన్ని మొత్తం శాసిస్తున్న ప్రెస్ క్లబ్స్ లలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ,బషీర్బాగ్ ప్రెస్ క్లబ్స్ ప్రధాన పాత్రను పోషిస్తున్నాయన్నారు. ఎక్కడ చూసినా కుల వివక్షతను

- మిగతా 3లో..



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

ప్రజల్లోకి బడ్జెట్‌ను తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదే

చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

అమరావతి,ఫిబ్రవరి28(జై భీమ్ న్యూస్) :

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌కు రూపకల్పన చేశామని సీఎం చంద్రబాబు అన్నారు. బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షత టీడీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఇబ్బందికర పరిస్థితుల్లో కూడా ప్రజలకు మంచి బడ్జెట్ అందిస్తున్నామన్నారు. దీనిని ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలని, వచ్చే ఎన్నికల్లో కూడా టికెట్ దక్కాలంటే ఎమ్మెల్యేల పనితీరులో మార్పు రావాలన్నారు. మళ్లీ అసెంబ్లీకి రావాలి అనే భావనతో ఎమ్మెల్యేల పనితీరు ఉండాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం ఉండాలని.. ఎక్కడా విభేదాలకు తావు లేదని, గ్రూపులు కడితే సహించేది లేదని హెచ్చరించారు.కష్టాల్లో కూడా మంచి బడ్జెట్‌ను ప్రజలకు అందించామని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. వైకాపా పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ప్రజలు గుర్తించారన్నారు. ఈ బడ్జెట్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యత ఎమ్మెల్యేలదే అని అన్నారు. కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని అన్నారు.




ఒకవైపు ఇంటి పని..మరోవైపు ఉద్యోగం

ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తున్న మహిళలు

ఎంప్లాయిమెంట్‌లో 25 శాతానికి పెరిగిన భాగస్వామ్యం

ఇంట్లోవారి కోసం రోజుకు 289 నిమిషాలు

88 నిమిషాలకే పరిమితమైన పురుషులు

జాతీయ గణాంకాల కార్యాలయ సర్వే

4

# బెదిరిస్తే బెదరడానికి ఎవరూ లేరు

సీఎం రేవంత్ రెడ్డి

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి బెదిరిస్తే బెదరడానికి ఇక్కడ ఎవరు లేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కిషన్ రెడ్డి సైందవ పాత్ర పోషిస్తున్నారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరు చీకటి మిత్రులు అని అభివర్ణించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోన్న ప్రాజెక్ట్‌లకు అనుమతులు ఇస్తేనే తెలంగాణకు రావాలని కిషన్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. కేంద్రం ప్రత్యేకంగా తెలంగాణకు ఇచ్చింది ఏమీ లేదన్నారు. ఇన్ని సార్లు ముఖ్యమంత్రి వచ్చి అడుగుతోన్నా.. మీ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు మాత్రం తమను ఎందుకు అడగడం లేదని మోదీ కేబినెట్‌లోని మంత్రులు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్మాణం ద్వారా బలమైన పునాదులు వేస్తామన్నారు. పేద వారికి కాంగ్రెస్ పార్టీఅందుబాటులో ఉండేలా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించామని చెప్పారు. కార్యకర్త మనసు ఎరిగిన నాయకురాలు మీనాక్షీ నటరాజన్ అని ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్న విధానం చూస్తే తనకు నవ్వొస్తుందన్నారు. తాము అడుగుతోంది ప్రధాని మోదీ ఆస్తి కాదన్నారు. తాము కట్టిన పన్నుల నుంచి తమకు నిధులు ఇవ్వమని మాత్రమే అడుగుతున్నామన్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్‌కు ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణకి ఇవ్వరా? అని మోదీ ప్రభుత్వాన్ని సీఎం సూటిగా ప్రశ్నించారు. మూసీకి నిధుల ఇవ్వమంటే ఎందుకంత అసహనమంటూ బీజేపీ నేతల వైఖరిపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మెట్రో ప్రాజెక్ట్‌కు నిధులు ఇవ్వమంటే ఇవ్వడం లేదన్నారు. మెట్రో, రీజనల్ రింగ్ రోడ్డును కేంద్ర క్యాబినెట్ ఎజెండాలో ఎందుకు పెట్టడం లేదంటూ బీజేపీ అగ్రనేతలను ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. కేంద్రం ప్రత్యేకంగా తెచ్చిన ప్రాజెక్టు ఒక్కటైనా తెలంగాణలో ఉందా? అని ప్రశ్నించారు. దమ్ముంటే ఏపీలో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేయండంటూ కేంద్రంలోని బీజేపీ అగ్రనేతలకు సీఎం రేవంత్ సవాల్ విసిరారు. అలాగే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు .. బీసీ కేటగిరిలో ఉన్నాయని గుర్తు చేశారు. ఎన్నికల కోసం మంద కృష్ణను బీజేపీ కౌగిలించుకుందన్నారు. అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయడం లేదంటూ బీజేపీ నేతలను ఆయన బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డు పడడం వల్లే తెలంగాణకి అన్యాయం జరుగుతోందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.



# 'కుంభమేళా' రాజకీయం!

న్యూఢిల్లీ(జై భీమ్ న్యూస్)

నలభై ఐదు రోజుల పాటు జరిగిన మహా కుంభ మేళా జనవరి 13న మొదలై,ఫిబ్రవరి 26 బుధ వారంతో ముగిసింది. 66.21 కోట్ల మంది స్నానాలు ఆచరించారని, రూ.3 లక్షల కోట్లకు పైగా ఆదాయం సమకూరిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. కుంభమేళా ఏర్పాట్లలో ఏదైనా అసౌకర్యం జరిగి ఉంటే తమను క్షమించాలని ప్రధాని నరేంద్రమోడీ ఎక్స్ వేదికగా భక్తులను కోరారు. కనీవినీ ఎరగని విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ప్రచారం చేయడం, సంఘ్ పరివారం ప్రత్యేక దృష్టి పెట్టి కదిలించటం తదితర కారణాల వల్ల ఈసారి పెద్ద సంఖ్యలో జనం కుంభమేళాలో పాల్గొన్నారు. ప్రచారం చేసినంత స్థాయిలో జాగ్రత్తలు, ఏర్పాట్లూ లేకపోవడం వల్ల ప్రయాగరాజ్‌లోనూ,ఢిల్లీలోనూ తొక్కిసలాటలు జరిగి 48 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. వందల మంది

- మిగతా 3లో..



జై భీమ్ POWER OF PEOPLE

# సంపాదకీయం

## వరదాయకుడు లక్ష్మీనరసింహుడు

తెలంగాణలోని ప్రముఖ ఆలయాలలో ఒకటైన, ఉమ్మడి నల్లగొండజిల్లా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రము సమీపములో ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయములో మార్చి 1నుండి మార్చి 11వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఋష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు యాదమహర్షి చిన్నతనం నుంచే హరి భక్తుడు. ఆంజనేయస్వామి సలహాపై ప్రస్తుతం యాదగిరిగా పిలవబడుతున్న ప్రదేశంలో చాలా కాలం తపస్సు చేశారు. అప్పుడు ఒక రాక్షసుడు ఆహార అన్వేషణలో అటుగావచ్చి నిశ్చల తపస్సులో వున్న ఈ ఋషిని చూసి తినబోయాడు. ఆ విషయం తపస్సులోవున్న ఋషికి తెలియలేదు గానీ, ఆయన ఎవరి గురించైతే తపస్సు చేస్తున్నాడో ఆ శ్రీ హరి ఆయుధం అయిన సుదర్శన చక్రం వచ్చి ఆ రాక్షసుని సంహరించింది. అది చూసిన ఋషి ఆ సుదర్శన చక్రాన్ని పలు విధాల ప్రార్థించి, భక్తులకు ఏవిధమైన బాధలూ కలుగకుండా దుష్ట సంహారం చేస్తూ అక్కడే వుండిపొమ్మని కోరగా ఆ సుదర్శనము అనతికాలము లోనే అక్కడ వెలయ బోవుచున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ శిఖరాన షట్కోణాకారాన వెలసి స్వామి దర్శనానికి వచ్చు భక్తులను సదా కాపాడుతూ వుంటానని వరమిచ్చి అంతర్ధానం అయినట్లు కథనం. యాద మహర్షి తన తపస్సుని కొనసాగించగా, ఆయన తపస్సుకి మెచ్చి నరసింహస్వామి ప్రత్యక్షమై, యాద మహర్షి కోరిక మీద అక్కడ లక్ష్మీ నరసింహస్వామి గా వెలిశాడు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. ఆ ఋషి తపస్సు చేసింది, స్వామి ప్రత్యక్షమైంది కొండక్రిందవున్న పాత లక్ష్మీ నరసింహస్వామి గుడి దగ్గర అని అంటారు. యాద మహర్షి కోరిక మీదే ఆంజనేయస్వామి యాదగిరిలో క్షేత్రపాలకుడుగా వున్నాడు. ప్రహ్లాదుని రక్షించటానికి, అహోబిలంలో నరసింహస్వామి స్తంభాన్ని చీల్చుకుని వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత ఆ భీకర రూపాన్ని శాంత పరచటం ఎవరికీ సాధ్యం కాలేదట. అప్పుడు దేవతలంతా లక్ష్మీదేవిని ప్రార్థిస్తే ఆమె ప్రత్యక్షమై స్వామిని శాంతింప చేసిందట. అప్పుడు ప్రహ్లాదుడు స్వామిని అక్కడే ప్రసన్న రూపంలో కొలువై వుండమని కోరాడట. అయితే స్వామి అతి భీకర రూపంలో దర్శనమిచ్చిన ఆ ప్రదేశంలో శాంత రూపంతో కొలువై వుండటం లోక విరుద్ధమని అక్కడికి సమీపంలో వున్న యాదగిరిలో లక్ష్మీ నరసింహస్వామి గా లోక కళ్యాణార్థం కొలువు తీరుతానని బయల్దేరారు, లక్ష్మీ సమేతుడై కొండపై గల గుహలో వెలిశారు. ఆయనవెంట ప్రహ్లాదుడూ, సకల దేవతలూ వచ్చి ఆయనతోపాటు ఇక్కడ కొలువుతీరి స్వామిని సేవిస్తూ వచ్చారట. రాక్షస సంహారంచేసి లోక కళ్యాణం చేశారని సంతోషంతో స్వామివారి కాళ్ళని బ్రహ్మదేవుడు ఆకాశ గంగతో కడిగాడట. ఆ ఆకాశ గంగ లోయలలోంచి పారి విష్ణు పుష్కరిణిలోకి చేరింది. ఈ పుష్కరిణికి కూడా చాలా ప్రాముఖ్యం వుంది. ఇందులో స్నానంచేసి స్వామిని సేవించినవారికి సకల కోరికలూ తీరుతాయి. ఇక్కడ పితృకార్యాలు చేస్తే పితృ దేవతలు తరిస్తారు. చాలామంది భక్తులు ఆరోగ్యం, గ్రహపీడా నివారణ, వగైరా కోరికలతో కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి విష్ణు పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తారు. అంతేగాక ఇప్పటికీ రోజూ రాత్రుళ్ళు ఆ చుట్టుప్రక్కల కొండలమీద తపస్సు చేసుకుంటున్న ఋషులు విష్ణు పుష్కరిణిలో స్నానంచేసి స్వామిని అర్చిస్తారట. దానికి నిదర్శనంగా వారు వచ్చేటప్పుడు మృదంగ ధ్వనులు వస్తాయట. పాదాల గుర్తులు కొందరు చూశారుట. వారు స్వామిని అర్చించిన గంధ పుష్పాదులు కూడా నిదర్శనమంటారు. మెట్ల మార్గాన వెళ్తే దోవలో శివాలయం కనబడుతుంది. ఇక్కడ శివుడు లక్ష్మీ నరసింహస్వామి కన్నా ముందు స్వయంభూగా వెలిశాడు. ఇంకో విశేషం .. ఈ మెట్లు ఎక్కి స్వామిని సేవించినవారి కీళ్ళ నొప్పులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం యాదగిరి లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ముఖద్వారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నల్గొండ జిల్లాలో ప్రముఖ మైన దివ్య క్షేత్రం: యాదగిరి గుట్టకు సంబందించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో వున్నది. విభాండక ఋషి కుమారుడు ఋష్యశృంగుడు. అతని కుమారుడు హాద ఋషి, అతనినే హాదర్షి అని కూడ అంటారు. అతను నరసింహ స్వామి భక్తుడు. అతనికి స్వామివారిని ప్రత్యక్షంగా చూడాలని కోరిక పుట్టింది. ఆంజనేయస్వామి సలహా మేరకు తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమవుతాడు. ఆ ఉగ్ర నరసింహ మూర్తిని చూడలేక శాంత స్వరూపంతో కనిపించమని యాదర్షి కోరగా స్వామి వారు కరుణించి లక్ష్మి సమేతుడై దర్శన మిచ్చి "ఏంకావాలో కోరుకో" మంటే యాదర్షి స్వామి వారికి "శాంత మూర్తి రూపంలోనె కొలువై కొండపై ఉండి పొమ్మని కోరాడు. ఆవిధంగా లక్ష్మి నరసింహ స్వామి కొండపై అలా కొలువై ఉండి పోయాడు.కొన్నాళ్ళకు స్వామివారిని వేర్వేరు రూఫాల్లో చూడాలనిపించి యాదర్షి మరలా తపస్సు చేశాడు. అతని కోరిక మేరకు స్వామి వారు జ్వాలా, యోగా, నంద, గండబేరుండ, నారసింహ రూపాల్లో దర్శనమిచ్చాడు. అందుకే ఈ క్షేత్రాన్ని పంచ నారసింహ క్షేత్రం అంటారు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. బ్రహ్మోత్సవాలు తొలిరోజు ఈ నెల 1న విశ్వక్సేన ఆరాధనతో ఆరంభమై అలంకార అవతార సేవలతో కొనసాగి మార్చి 11న చక్రస్నానం, మహాపూర్ణాహుతితో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 1న ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, సాయంత్రం మృత్సాంగ్రహణం, అంకురారోహణ పర్వాలు నిర్వహిస్తారు. 2 ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ట, 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6:30 గంటలకు భేరీ పూజ, హవనం, దేవతాహ్వానం నిర్వహిస్తారు. 3న ఉదయం తొమ్మిది గంటలకు మత్స అవతార అలంకార సేవ, వేద పారాయణం, రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 4న ఉదయం 9 గంటలకు వటపత్ర శాయి అలంకార సేవ , రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ, 5 ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణలంకార సేవ, రాత్రి 7 గంటలకు పొన్నవాహన సేవ, 6న ఉదయం 9 గంటలకు గోవర్ధన గిరి దారి అలంకార సేవ, రాత్రి 7 గంటలకు సింహ వాహన సేవ, 7న ఉదయం 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవ, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ, తదుపరి శ్రీ స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. 8న ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకార హనుమంత వాహనం సేవ , రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, శ్రీ స్వామి అమ్మవార్ల తిరు కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. 9వ తేదీన ఉదయం 9 గంటలకు మహా విష్ణు అలంకారం, గరుడోత్సవము, రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం, 10వ తేదీన ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం 7 గంటలకు శ్రీ పుష్పయాగం, దేవతో ద్వాసన, 11వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీ స్వామివారికి అష్టోత్తర శతకటాభిషేకం, రాత్రి 9 గంటలకు శ్రీ స్వామివారి శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. దేవస్థానం ఈఓ భాస్కర్ రావు నేతృత్వంలో అధికారులు, అర్చకులు, సిబ్బంది వివిధ శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు.

# అకుట్ ఎన్నికల పోరులో అసలైన "సారథి" ఎవరు

**అధ్యక్ష పదవిలో ఇద్దరు అసాధ్యులే.**
**పనితనంలో ఆచార్య మల్లికార్జున రెడ్డికి ఎవరూ సరితూగరు.**
**ఆచార్య మల్లికార్జున్ రెడ్డిని ఓడించడానికి అక్రమ శక్తులు ఒకటవుతున్నాయి.**
**కష్టబోతు మల్లికార్జునుడు వ్యవస్థకు మేలు చేయడంలో మొనగాడు.**
**టీచర్ మేధావులారా అజ్ఞాత శక్తుల కుట్రలను జాగ్రత్తగా పసిగట్టండి.**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

పోరాటం చేసేవాడు పదవిలో ఉన్నంతకాలం ఏ సమస్య పరిష్కారానికైనా సాధ్య అసాధ్యాలను పక్కన పెట్టి పరిష్కారం మార్గంలో నిస్వార్థతను చూపించగలరు. కేయూలో వందల సమస్యలు కుప్పలై కూర్చుని కాకతీయ విశ్వవిద్యాలయాన్ని పట్టిపీడిస్తున్నాయి. అందులో ఎక్కువ శాతం అవినీతి అక్రమాలు జరిగినటువంటి అంశాలే మొదటి వరుసలో ఉంటున్నాయి. దానికి పూర్తి కారణం ఆయా శాఖల వారీగా పరిపాలించిన అధికారులు విశ్వవిద్యాలయాన్ని అస్తవ్యస్తం చిన్న భిన్నం చేసి ఎవ్వరికి తోచిన విధంగా వాళ్ళు విశ్వవిద్యాలయ రూపురేఖల్ని ముక్కలు చెక్కలుగా చేసి ఏం తెలియనట్లు నటిస్తున్నారు. అధికారాలను అడ్డం పెట్టుకొని విశ్వవిద్యాలయ నిధుల దోపిడీకి పాల్పడినోళ్లు నిజాయితీపరులుగా చలామనవుతున్నారు. వ్యవస్థను అక్రమ మార్గంలో నాశనానికి పాల్పడిన వాళు ్ళ అధికార పదవుల కోసం ఆరాటపడుతూ ఆర్భాటపడుతూ వ్యవస్థలను మరింత నాశనం లోనికి నెట్టి వేయడానికి ఉవిల్లాడుతున్నారు. అదే సమయంలో టీచర్ల సమస్యలే కాకుండా విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాల కాపాడగల శక్తి ఆచార్య మల్లికార్జున్ రెడ్డికి కలదు.

కాకతీయ విశ్వవిద్యాలయంలో అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ ఎన్నికలు రాజకీయవేడిని పుట్టిస్తున్నాయి. ఇద్దరు యోధాను యోధులు, మేధావులైన ఆచార్యులు అధ్యక్ష పదవికి బరిలో నిలుస్తుండగా ఎవరి విజయం వారిదేనంటూ దీటుగా బరిలో నిలుస్తున్నారు. ఒక వైపేమో గడిచిన సంవత్సరాలన్ని అవినీతి అక్రమాలకు పాల్పడిన ఒక గ్రూపు సమూహం ఆచార్య మల్లికార్జున్ రెడ్డి గెలుపును నిలువరిస్తేనే వాళ్ల వ్యక్తిగత ఎక్సిస్టెన్సును నిలుపుకోగలమని భావిస్తూ అందరూ ఏకమై ఒక మేధావి ఆచార్యుడైన వెంకట్రాం రెడ్డిని బరిలో నిలిపారు. నిజాయితీగా ప్రస్తావించాల్సి వస్తే కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్య వెంకట్రామ్ రెడ్డి అత్యంత పరిశోధన చేయించగల సమర్థవంతమైన ఆచార్యునిగా పేరు ఉన్నప్పటికీ ప్రత్యక్ష ఎన్నికల్లో ఎక్కడా పోటీచేసిన దాఖలాలు లేకపోగా అధ్యాపకుల సమస్యలపై నేరుగా ఎక్కడ పోరాటం చేసిన పరిస్థితులు లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. దానికి తోడు విశ్వవిద్యాలయంలోని టీచర్ల సమస్యలపై ఎక్కడ పట్టుబడి పోట్లాడింది లేదు. ప్రస్తుతం జరుగుతున్న ఆకుట్ ఎన్నికల్లో ఆచార్య మల్లికార్జున్ రెడ్డి విజయ ప్రభంజనాన్ని అడ్డుకోవడం కోసం అజ్ఞాత శక్తి కలిగిన అపర మేధావులు ఒక మేధావి ఆచార్యుని పావుగా వాడుకుంటున్నారని విశ్వవిద్యాలయ మేధావి సమాజం పసిగట్టలేకపోతుంది. ఇద్దరు ముగ్గురు అజ్ఞాత అక్రమార్కులు సమూహంగా ఏర్పడి గతంలో కొనసాగించిన ఆగడాలను, అక్రమాలను అవినీతిని నిరంతరం కోసం సాగించవచ్చుననే ఆకాంక్షతో ఆచార్య మల్లికార్జున్ రెడ్డిపై విషపూరితమైన, కక్షపూరితమైన, సత్య దూరమైన అంశాలను పదేపదే ప్రస్తావిస్తూ ఆచార్య మల్లికార్జున్ రెడ్డిని మానసిక వేధింపులకు గురిచేసి పోటీలో నుండి తప్పుకునే విధంగా విషపూరితమైన ప్రయత్నాలు చేశారు. ఆచార్య మల్లికార్జున్ రెడ్డి విశ్వవిద్యాలయంపై అత్యంత శక్తివంతమైన రక్షణ పాత్రను పోషించినట్లు లెక్కలేనన్ని ఆధారాలు కళ్ళ ముందు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ గతంలో సహాయం పొందిన వాళ్లు ప్రస్తుతం రానున్న కాలంలో సహాయం పొందాల్సిన వారు కొంతమంది కలిసికట్టుగా ఆచార్య మల్లికార్జున్ రెడ్డికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయిస్తుండడంలో ఒకరిద్దరూ పదవి కాంక్ష కలిగిన ఆచార్యులు అంతర్గత కుట్రలను పన్నుతున్నట్లు తేటతెల్లమవుతుంది. అక్రమార్కులనే ఆదర్శంగా తీసుకుంటూ కొంతమంది నిజాయితీ కలిగిన మేధావులు కూడా వాళ్లనే అనుసరిస్తుండడం విశ్వవిద్యాలయ ప్రతిష్టపై తీరని భారం పడే ఆస్కారం ఉంది. వాస్తవానికి ఆచార్య మల్లికార్జున్ రెడ్డి విశ్వవిద్యాలయంలో ప్రతి సమస్యపై పోరాటం చేయగల, ధైర్యసాహసాలను ప్రదర్శించే వ్యక్తిగత సామర్థ్యం కలిగిన ఆచార్యునిగా అపారమైన అనుభవం ఉండడంతో పాటు ఎంతటి జటిలమైన సమస్యనైనా తన వ్యక్తిగత పరిజ్ఞానంతో అవసరమైతే ప్రభుత్వాన్ని సైతం మెప్పించి పరిష్కరించగల పరిజ్ఞానవంతులుగా ఇంతకుముందే నిరూపించుకున్నారు. ప్రస్తుతం నడుస్తున్న అకుట్ రాజకీయ వేడి ఆచార్య మల్లికార్జున్ రెడ్డి నిజాయితీగల ప్రదర్శనను కట్టడి చేయాలని తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్న అపర మేధావులకు ఎటువైపు సహకరిస్తున్నామో తెలియ లేకుండా నిజాయితీని ప్రదర్శించలేకపోవడం వాళ్ల వాళ్ల వ్యక్తిగత విశ్వాసానికే వదిలేయాలి. గతంలో విశ్వవిద్యాలయంలో నెలకొల్పబడిన కఠినమైన సమస్యలను ఒంటి చేత్తో పరిష్కరించగల సమర్థున్ని గెలిపించుకోవడంలో విశ్వాసనీయతను ప్రదర్శించాల్సిన మేధావి సమూహం గతంలో కొనసాగిన విధంగా అజ్ఞాత శక్తి అక్రమ అవినీతిని పెంచి పోషించడం కోసం జ్ఞానవంతుడైన మేధావిని రంగంలోకి దింపి రాజకీయాలాడుతుండడం మేధావి సమూహం పసిగట్టలేకపోతున్నారు. పదవి కాంక్షే ప్రధానమనుకుంటే ఆచార్య మల్లికార్జున్ రెడ్డి గతంలో రిజిస్ట్రార్ పదవిని గరిక పోసతో సమానంగా భావించి అవతల పారేసేవారుకాదు. విశ్వవిద్యాలయ సంక్షేమం కొరకు భావితరాల భవిష్యత్తు కొరకు ప్రభుత్వ ప్రతిష్టను పెంచే విధంగా విశ్వవిద్యాలయ అభివృద్ధిని పెంపొందించే విధంగా తీవ్రమైన కృషి చేయడం కోసం వచ్చినటువంటి అవకాశాన్ని సదవకాశంగా మలుచుకొని ప్రభుత్వ నుండి రావాల్సిన నిధులను కష్టపడి, ప్రయాసపడి పోరాట స్ఫూర్తితో తెప్పించగల నికార్సైన ప్రతిభ కలిగిన ఆచార్య మల్లికార్జున్ రెడ్డికి ఉందనే సంగతిని చరిత్రల ఆధారాలను పరిశీలిస్తూ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విశ్వవిద్యాలయ అభివృద్ధిని కోరుకునేవారు అవినీతిని అక్రమాలను పెంచి పోషిస్తూ రాక్షసత్వమైన రహస్య రాజకీయాలను వ్యక్తిగత స్వాలాభాలను అత్యంత మేధావి శక్తివంతమైన ఆకుట్ ఎన్నికలపై రుద్దడం అనేది ముమ్మాటికి మూర?త్వం.. ఎన్నికల బరిలో నుండి తప్పకుండా అధ్యాపక మేధావులను అభినందించాల్సి ఉంది. పోటీలో నిలిచిన మేధావులలో రాజకీయాలకు అతీతంగా, కుట్రలకు వ్యతిరేకంగా విశ్వవిద్యాలయ బాగోగుకు సమీపంగా ఉన్నటువంటి నాయకత్వాన్ని బలపరచడం మేధావుల రక్షణగా భావించాలి. నాశనాన్ని కోరుకునేవారు నామరూపంలేని రాజకీయాలను ప్రోత్సహించడం విశ్వవిద్యాలయ మేధావులు పసిగట్ట లేకపోతున్నారనుకోవడం అత్యంత మోసం. వెనుక జరిగే రాజకీయాలు, ముందు జరిగే కుట్రలు జరగబోయే అకుట్ ఎన్నికల ఫలితాలలో కాలమే ధీటైన సమాధానం ఇవ్వాలని ఆశిద్దాం మేధావి ఓటర్ మహాశయ విశ్వవిద్యాలయాన్ని కాపాడండి కుహాన శక్తుల కుట్రను కూలదోయండి - నిజాయితీ శక్తులను నిలబెట్టండి.

**కొసమెరుపు...**

ఆచార్య వెంకట్రాంరెడ్డి రిజిస్ట్రార్ గా కొనసాగిన కాలమంతా విశ్వవిద్యాలయం అత్యంత నాశనం కూపంలోనికి నెట్టబడిందనదానికి ప్రధానంగా పరిశీలించాల్సిన అంశాలలో విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ కోర్సులు అన్నిటికీ ఊహించని విధంగా ఉన్నతమైన స్థాయిలో ఫీజులు పెంచి విద్యార్థుల భవిష్యత్తును నాశనములోనికి నెట్టారు. కరుడుగట్టిన భూకబ్జాదారున్ని పాలకమండలి సమావేశం నిర్ణయించి తొలగిస్తే రహస్యంగా కోర్టుకు సమాధాన ఇవ్వకుండా ఆలస్యం చేసి పై అధికారులు తీసుకున్న లంచానికి దాసోహమై ఉద్యోగంలోనికి తీసుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ,సివిల్ రెగ్యులర్ కోర్సుల, విభాగాలను సెల్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చి 480 మంది విద్యార్థులను నాలుగు సంవత్సరాల పాటు చిత్రవధకు గురిచేసి రోడ్ల పైన పడేసారు. సెల్ఫ్ ఫైనాన్స్ విద్యార్థులకు హాస్టల్ కేటాయించడం లేదంటూ రాత్రికి రాత్రే ఆర్డర్ తీసి పరీక్ష రాస్తున్న విద్యార్థులను కనికరం లేకుండా మెడలు పట్టి బయటకు నెట్టించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును అక్రమార్కునికి కట్టబెట్టి నిజాయితీ అనిపించుకున్నారు. విశ్వవిద్యాలయ భూములకు కలెక్టర్ నివేదిక ఇచ్చినప్పటికిని కనీసపు చర్యలు తీసుకోకుండా ఉత్తరాలు రాస్తూ లోలోపల భూకబ్జాదారుల సహకరించారు. ప్రధాన సమస్యగా నేటికీ కొట్టుమిట్టాడుతున్న పీహెచ్డీ ప్రవేశాల అంశంలో 3. ఏ క్లాజును 3.6 సబ్ క్లాస్ గా మార్చి కేటగిరి 1 నోటిఫికేషన్ లో పార్ట్ టైం పరిశోధనకు ప్రభుత్వ ఉద్యోగులకు అవకాశం కల్పిస్తున్నట్లు 25శాతం సీట్లు కేటాయించి ఫెలోషిప్ అర్హత పొందిన విద్యార్థులను చిత్రహింసల గురి చేశారు. ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు, విద్యార్థులపై అక్రమ కేసులు ఉద్యోగుల బదిలీల్లో ఎక్కడ లేని చర్యలు చేపట్టడం ఇవన్నీ సంవత్సర కాలంలో జరిగిపోగా విశ్వవిద్యాలయంలోని అన్ని కోర్సులకు 20 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను కేటాయిస్తూ విశ్వవిద్యాలయాన్ని భ్రష్ట పట్టించారు. ఇలా చెప్పుకుంటూ పోతే సంవత్సర కాలంలో లెక్కలేని విధంగా అధికారులంతా ఏకమై విశ్వవిద్యాలయాన్ని నాశనకుపంలోనికి నెట్టారు. అన్నిటికన్నా ప్రధాన సమస్యగా పేరుగాస్తున్న 2010 అధ్యాపకులకు పదోన్నతులు కేటాయించకుండా రిజిస్ట్రార్ గా కొనసాగి మాజీ వీసీ కనుసందల్లో నటించారేతప్ప న్యాయం చేయలేకపోయారు. పాలకమండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఏ ఒక్కటి అమలుపరచకుండా విశ్వవిద్యాలయాన్ని పూర్తిగా వెనక్కి నెట్టేశారు. ఏ తప్పు చేయనప్పటికిని అధికారం నుండి తప్పిస్తున్న పై అధికారులపై ఎందుకు తొలగిస్తున్నారని తిరుగుబాటు చేయలేకపోయారు. పైగా రిజిస్ట్రార్ పదవి ద్వారా కావలసినంత నాశనం జరుగుతుండగా ఒక్కరోజు ప్రశ్నించలేకపోయారు. అన్ని సంతకాలు దగ్గరుండి చేసి విశ్వవిద్యాలయం ఆగమయ్యాక పదవి నుంచి తప్పించబడ్డారు. నేడు అకుట్ అధ్యక్ష పదవిలో పోటీలో నిలుస్తున్న ఆచార్య వెంకట్రాంరెడ్డి విశ్వవిద్యాలయం మేధావి సమాజానికి ఏం సాంకేతం ఇవ్వడానికి ఎన్నికల బరిలో నిలిచారనేది నేటికీ ప్రశ్నార్థకంగా మిగిలింది. పైగా అవకాశం ఇవ్వండి సేవ చేస్తాను అని సన్నిహిత వర్గం ద్వారా ప్రచారం చేయిస్తుండడం పచ్చి మోసం. పరిశోధనలో దేశస్థాయిలో పేరుగాంచిన ఆచార్య వెంకట్రాంరెడ్డి ప్రస్తుతము హెచ్చెట్ రాష్ట్ర కన్వీనర్ గా కొనసాగుతున్నారు. తలకు మించిన భారాన్ని మోయకుండా సమర్థవంతంగా పదవిని నిర్వహిస్తూ రాష్ట్రానికి దోహదపడాల్సిన సమయంలో ఒకరిద్దరూ ప్రోత్సహించడంతో.... పని సాధ్యపరున్ని వ్యతిరేకిస్తూ బరిలో నిలిచి విశ్వవిద్యాలయానికి అక్రమ శక్తులకు అవినీతిపరులకు అకుట్ సమూహాన్ని దాసోహం చేయాలని చూస్తున్నారు. పైవన్నీ తప్పని నిరూపిస్తే దేనికైనా సిద్ధమే అంటూ విశ్వవిద్యాలయం మేధావి విద్యార్థులు విశ్వవిద్యాలయ సమాజం సూటిగా ప్రశ్నిస్తుంది.

# విశ్వవిద్యాలయ వ్యతిరేకి మల్లారెడ్డిని తొలగించండి

**పోరాటాలకు తావివ్వకండి.**
**విశ్వవిద్యాలయాన్ని విద్వాంసం చేసిన ఆచార్య మల్లారెడ్డి.**
**ఓఎస్డి పదవి నుండి తప్పించకపోతే జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుంది.**
**పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలను నాశనం చేసిన మల్లారెడ్డి.**
**వ్యవస్థ వ్యతిరేకుల్ని ప్రోత్సహించడం అవమానకరం.**
**మల్లారెడ్డి ఉద్యోగ నియామకంపై గతంలో విచారణ రిపోర్టు కోరిన ప్రిన్సిపాల్ సెక్రటరీ**
**మల్లారెడ్డికి యూనివర్సిటీ పరిపాలనలో ఎలాంటి పదవులు ఇవ్వకూడదు.**
**ఓఎస్డి పదవి నుంచి మల్లారెడ్డిని వెంటనే తొలగించాలి.**
**కేయూ ఐక్య విద్యార్థి సంఘం**

**వరంగల్ (కాకతీయ యూనివర్సిటీ) జై భీమ్ న్యూస్**

కాకతీయ యూనివర్సిటీ పరిపాలనలో మల్లారెడ్డికి ఎలాంటి పదవులు ఇవ్వకూడదని, ఆయనను ఓ.ఎస్.డి పదవి నుంచి తొలగించాలని కేయూ ఐక్య విద్యార్థి సంఘం నాయకులు విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ) ప్రతాప్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ, గతంలో మల్లారెడ్డి అసోసియేట్ ప్రొఫెసర్ నియామకం విషయంలో రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి విచారణ రిపోర్టు కోరినప్పటికీ, ఆయన రిజిస్ట్రార్‌గా ఉండగా దాన్ని దాచిపెట్టారని ఆరోపించారు. అలాగే, క్యాంపస్‌లో విద్యార్థులు, ఉద్యోగుల పట్ల అమానుషంగా ప్రవర్తించడం, చిన్న స్థాయి ఉద్యోగులకు అవమానకరంగా మాట్లాడడం వంటి ప్రవర్తనలకు పాల్పడ్డ మల్లారెడ్డిని వెంటనే ఓ.ఎస్.డి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులు మరింత వివరిస్తూ, అసోసియేట్ ప్రొఫెసర్‌గా అర్హత లేకుండా నియామకం పొందడం, తాను సీనియర్ ప్రొఫెసర్‌గా చలామణి కావడం, తన విభాగంలోని విద్యార్థులకు తరగతులు చెప్పకపోవడం, నియామకం అయినప్పటి నుండి విద్యాబోధనను పూర్తిగా విస్మరించడం వంటి విషయాలను ప్రస్తావించారు. అలాగే, గతంలో పరీక్షల విభాగం కంట్రోలర్‌గాను, సైన్స్ డీన్‌గాను ఉన్న సమయంలో పరిపాలనా దక్షతలో పూర్తిగా విఫలమయ్యారని, అనేక అక్రమాలకు తావిచ్చారని ఆరోపించారు.

**ఓఎస్డి పోస్టు రద్దు అయ్యేంతవరకు ఉద్యమం కొనసాగిస్తాం..**

విద్యార్థి సంఘాల నేతలు మల్లారెడ్డికి పదవులు ఇవ్వొద్దని అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ యూనివర్సిటీ యాజమాన్యం స్పందించలేదని విమర్శించారు. ఇప్పటికైనా అతనికి ఎలాంటి పదవులు ఇవ్వకూడదని స్పష్టం చేస్తూ, యూనివర్సిటీ పరిపాలనలో అతనికి పాత్ర కల్పిస్తే తీవ్ర పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఇక పరీక్షల విభాగం స్క్రాప్ అమ్మకాలలో అక్రమాలకు పాల్పడ్డ అధికారులకు మల్లారెడ్డి సహకారం అందించారని, ఆ ప్రతిఫలంగా రిజిస్ట్రార్ పదవిని కైవసం చేసుకుని విశ్వవిద్యాలయ అభివృద్ధిని పదేళ్లు వెనక్కి తీసుకెళ్లాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఐక్య విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.



# పెత్తనాలు ఇంకెంతకాలం

మొదటి పేజీ తరువాయి

పోటీస్తూ సమన్యాయం జరగాల్సిన చోట ఆధిపత్యం పోరును కొనసాగిస్తుండడం నిమ్నస్థాయి జర్నలిస్టులు తట్టుకోలేకపోతున్నారు అన్నారు. పని భారాన్ని జర్నలిజంలో చూపించడం మేధావుల గొప్పతనం అన్నారు. ప్రెస్ క్లబ్స్ పెద్దలు ప్రతి అంశాన్ని సమన్వయ పరుస్తూ కొత్త వాళ్లకు అవకాశాలు కల్పిస్తూ జర్నలిజం విలువలను ప్రెస్ క్లబ్ నియమాలను పాటించడంతోపాటు ఎప్పటికప్పుడు సమాజానికి, ప్రభుత్వానికి తెలియజేయాలని అన్నారు. మనమంతా ప్రభుత్వానికి ప్రజలకు వారదులం అయినప్పుడు పనితనంలో హెచ్చుతగ్గులు ఉండాలి గాని ఆదిపత్యంతో అనిచి వేయడం లాంటివి ఏమాత్రం సరైనది కాదన్నారు. జర్నలిజంలో ఎవరి ధోరణి వాళ్లకు ఉంటుందని కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వాన్ని నిజాయితీగా సమాజానికి పరిచయం చేయడంలో పెద్ద స్థాయి జర్నలిజం వ్యవస్థలు కూడా దారి తప్పుతున్నాయని మండిపడ్డారు. నిజాన్ని నిర్భయంగా రాయలేని జర్నలిజం ముక్కుసూటి తనాన్ని ప్రదర్శించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు రాజ్యాంగ విలువలకు పెట్టింది పేరుగా నాలుగో స్తంభంగా నిలబడుతున్న జర్నలిజం అనుదినం ఎదుగుతూనే ఉండాలి కానీ రాజకీయాలతో వ్యక్తిగత స్వలాభాలతో సీనియర్, జూనియర్ వత్యాసాలతో దినదినం విలువలను దిగజార్చుకుంటుందన్నారు. ప్రధానంగా కులపిచ్చి జర్నలిజంకు ఏమాత్రం సరితూగదు అన్నారు. పనిచేసేవారిని గౌరవించాలి గాని అవమానపరచకూడదు అన్నారు. చిన్న వాళ్లమైనప్పటికీ ఇటు రాజకీయం అటు ప్రజాక్షేత్రంలో ప్రాణాలకు తెగించి పోరాడుతున్నమన్నారు. వ్యవస్థల ఆగడాలను ఎప్పటికప్పుడు పసిగడుతూ బేరీజు వేస్తూ ప్రజాస్వామ్యం ముందు నిలబెట్టడంలో ఎక్కడా వెనుకడుగు వేయడం లేదన్నారు. గౌరవప్రదమైన వృత్తిలో ఉంటూ అందరి మన్ననలను పొందుకోవడం కోసం అహర్నిశలు ప్రయత్నం చేస్తున్న జర్నలిస్టులను అగౌరవపరచోద్దన్నారు. జర్నలిజం వృత్తిలో వ్యక్తిగతానికి ఏ మాత్రం అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగతం అనేది వ్యవస్థ పతనానికి దారితీస్తుందని తెలిపారు. ఏం చేసైనా సరే పెత్తనం కొనసాగిస్తాం అనుకోవడం ఎంత కాలం తగదన్నారు. ప్రభుత్వాలే ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికల్లో పోటీ పడుతుండగా ఫలితాల ఆధారంగా తార్మారవుతున్నాయన్నారు. ప్రజాక్షేత్రంలో నిజాయితీగా నిలబడే జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్స్ లలో ఇంకెప్పుడు అవకాశం దొరుకుతుందని సంవత్సరాల తరబడి ఆత్రుతంగా ఎదురుచూస్తున్నారు అన్నారు. యువరక్తాన్ని వుత్సాహంగా ప్రోత్సహించే సీనియర్ జర్నలిస్టులపై అత్యంత గౌరవం మర్యాదలు ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. జర్నలిజన్ని ప్రాణంగా పెట్టుకుని బ్రతుకుతున్న సామాన్య జర్నలిస్టులకు ప్రభుత్వంతో పాటు ప్రెస్ క్లబ్స్ పెద్దలు తప్పకుండా న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇండ్ల స్థలాలలో గాని డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో గాని ఇందిరమ్మ ఇళ్లలో గాని సామాన్యులకు నిరుపేద జర్నలిస్టులకు తప్పకుండా అవకాశం కల్పించాలని ప్రత్యక్షంగా కోరారు. ప్లాట్ల పంపకాల్లో నైతే గతంలో పొందుకున్న వాళ్లే మళ్లీ మళ్లీ లిస్టులలో పేర్లు రాయించుకోవడం రాజకీయం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తరఫున లభించే లబ్ధిలలో ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా ప్రెస్ క్లబ్ పెద్దలు శ్రద్ధ వహించాలన్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తున్న వాళ్లకు న్యాయం జరుగనప్పుడు నేరుగా ప్రభుత్వమే రంగంలోకి దిగి కష్టపడి పనిచేస్తున్న జర్నలిస్టులకు న్యాయం చేకూర్చబడే విధంగా ప్రభుత్వం తరఫున రాష్ట్రవ్యాప్తంగా ప్రెస్ క్లబ్ పై ప్రత్యేక అధికారి నియమించి గ్రామస్థాయి జర్నలిస్టుకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. గతంలో జర్నలిజం అంటే ఎక్కడ మర్యాద లేదన్నారు కానీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో భావ స్వేచ్ఛ ప్రకటనకు అత్యంత విలువనిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిని అభినందించాలన్నారు. అలాంటి సందర్భంలోనే మంచితనాన్ని ఆసరా చేసుకుని ప్రెస్ క్లబ్స్ లలో రాజకీయాలు కొనసాగిస్తున్న సీనియర్ జర్నలిస్టుల పద్ధతిపై అంతట పలు అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ సమన్యాయం అనే పేరు మీద సీనియర్ జర్నలిస్టులు తప్పకుండా పునరాలోచించి పున:సమీక్షించి ప్రతి జర్నలిస్టుకి న్యాయం చేసే విధంగా ముందుకు రావాలన్నారు. జర్నలిజంలో పార్ట్ టైంకు అవకాశం లేదన్నారు నిరంతరము రోజు మొత్తం కష్టపడి పనిచేసే ఫుల్ టైం జర్నలిస్టులకు ఆంక్షలతో పని లేకుండా పక్కాగా న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం కేటాయిస్తున్న సంక్షేమ ఫలాల్లో కూడా రాజకీయం చేయడం ఎవరికి మంచిది కాదన్నారు. రానున్న కాలంలో జర్నలిజం విలువలు పెరగాలని ఆకాంక్షిస్తూ సీనియర్ జర్నలిస్టులు జూనియర్ జర్నలిస్టులను గౌరవించడంతోపాటు హక్కున చేర్చుకొని అన్ని విధాలుగా న్యాయం చేయాలన్నారు. అలాంటప్పుడే జర్నలిజం పట్ల ప్రభుత్వానికి, ప్రభుత్వ వ్యవస్థలకు ప్రభుత్వ అధికారులకు నాయకులకు ప్రజల మధ్య అత్యంత గౌరవాన్ని చేకూర్చిన వాళ్ళమవుతామన్నారు.

**కొసమెరుపు..**

జర్నలిజం విలువలు సమాజానికి దీటుగా నిలబడాలని ఆకాంక్షిస్తున్న వారిలో మొదటి వరుసలో నిలబడే సీనియర్ జర్నలిస్టు ఎస్సీ ఎస్టీ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు(రిజిస్టర్డ్ 2015),ఆల్ ఇండియా ఎడిటర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు,జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాల పట్ల తీవ్రంగా ఆవేదన వ్యక్తపరిచారు. ప్రెస్ క్లబ్ లలో కులాలను చూసి అక్రిడేషన్స్ కు అవకాశాలు కల్పిస్తుండడం విచారకరమన్నారు. సభ్యత్వ నమోదులో రాజకీయాలు ఆడుతుండడం విచిత్రమైన మోసం అన్నారు. ప్రెస్ క్లబ్స్ ఎన్నికలు అనగానే ఇక్కడ లేని ప్రేమ కనపరుస్తూ ఎన్నికలు అయిపోగానే విచిత్రమైన వ్యక్తులుగా ప్రవర్తిస్తున్నారని పరోక్షపు చురకలు వేశారు. ప్రెస్ క్లబ్ పదవికి సరియైన న్యాయం చేయగలిగినప్పుడే వ్యక్తిగత ఆత్మగౌరవం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం తరఫున మంజూరు అవుతున్న కోట్ల రూపాయల నిధుల ఖర్చుల లెక్కల ఆధారాలు గుట్టుచప్పుడుగా కనుమరుగు చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రెస్ క్లబ్స్ ఆధ్వర్యంలో స్వీకరించబడుతున్న నిధులను ఖర్చుల రూపంలో దేనికొరకు వాడకంలో ఉపయోగిస్తున్నారో లెక్కలు తారుమారు అవుతున్నాయని రాష్ట్రవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రెస్ క్లబ్స్ లలో సభ్యత్వం అంటే మొండిగా వ్యవహరిస్తున్న కొంతమంది కుహనాశక్తులైన జర్నలిస్టులకు సమాజాన్ని ప్రభావితం చేసే కథనాలు రాయడం కూడా రాదన్నారు. జర్నలిజం గౌరవం ఇతరులకు సహాయం చేయడంలో,న్యాయం చేయడంలో,సమాజ వ్యతిరేక శక్తుల పట్ల చిత్తశుద్ధితో పోరాటం చేయడంలో,అవినీతి, అక్రమాలను ఎదిరించడంలో, అక్రమార్కుల భరతం పట్టడంలో, ప్రభుత్వ వ్యతిరేక శక్తులపై నిక్కార్స్ గా నిలబడి కొట్లాడడంలో ,ప్రభుత్వ నిజాయితీని ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలకు సమపాలుగా తెలియజేయడంలో,ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ధైర్యంగా విమర్శిస్తూ ఎదిరించడంలో దాగి ఉంటాయన్నారు. జర్నలిజాన్ని జాతీయస్థాయిలో అభివృద్ధి పరిచే క్రమంలో అత్యంత విలువైన నిజాయితీని ప్రదర్శించాలన్నారు. జర్నలిజాన్ని రాజకీయపు రొంపుగా మారుస్తుండడం జీర్ణించుకోలేమన్నారు. తప్పు చేస్తున్న ఎంతటి వ్యక్తినైనా ఎదిరించి నిలబడడమే నేటి దినాల్లో మేటి జర్నలిజం అన్నారు. అక్రమార్కులను చూసి అవినీతిపరులను చూసి భయపడడం కొమ్ముగాయడం జర్నలిజం వృత్తి కాదన్నారు. ఎంతటివారినైనా సునాయాసంగా ఎదుర్కొని నిలబడడంలో ఉన్న ధైర్య సాహసాలను జర్నలిజం శాశ్వతంగా తన మదిలో నిలుపుకుంటుందని భద్రంగా కాపాడుతుందని తన వ్యక్తిగత ధైర్యాన్ని ప్రకటించారు.

## ‘కుంభమేళా’ రాజకీయం!

మొదటి పేజీ తరువాయి

గాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలు, అగ్నిప్రమాదాలు,చిన్న చిన్న తొక్కిసలాటలు,గంటల తరబడి ట్రాఫిక్ రద్దీలు వంటి ఇబ్బందులు అనేకం చోటు చేసుకున్నాయి. ఏర్పాట్లలో విఐపిలకు ఇచ్చినంత ప్రాధాన్యం సామాన్య భక్తులకు ఇవ్వలేదని మొదటి రోజు నుంచీ విమర్శలు వచ్చాయి.

సాధారణంగా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనే సామాన్య భక్తులు తమ సందర్శన ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతతను, సాంత్వనను ఆశిస్తారు. తమ విశ్వాసానికి తగ్గట్టుగా పూజాదిక విధులు నిర్వహించి,సంతృప్తి చెందుతారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలక్కుండా తగిన ఏర్పాట్లు చేయడం, అన్ని విధాలా భద్రత కల్పించటం పాలకుల విధి. ఆదిత్యనాధ్ ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు వెచ్చించి, ఏర్పాట్లు చేసింది.

ప్రజాప్రతినిధులు,పారిశ్రామికవేత్తలు,సెలబ్రిటీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రముఖులు ఎవరు వచ్చినా ఆ వార్తలను విపరీత ప్రచారంలో పెట్టింది. కోట్లాదిమందితో నదీతీరం, క్షేత్రాలూ కిక్కిరిసిపోతున్నాబీ వందల కిలోమీటర్ల మేర రహదారులు స్తంభించిపోయినా ప్రకటనలు హోరెత్తించింది. ‘పెద్ద సంఖ్యలో’ సమీకరించటంపై చూపిన శ్రద్ధాసక్తులు జనం పడే ఇబ్బందులపై ఇసుమంత కూడా కనపరచలేదు. అవకాశానికి మించినంత జనం వస్తున్నా %-% తగిన జాగ్రత్తలు తీసుకోని ఫలితమే ఢిల్లీ రైల్వేస్టేషన్‌లోని తొక్కిసలాట అని స్పష్టమైంది. ప్రజల కన్నా ప్రచారమూ, రాజకీయ ప్రయోజనమూ ముఖ్యమన్న ధోరణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెంటి వద్దా వ్యక్తం కావటం విచారకరం.

మొదటి తొక్కిసలాటలో భక్తులు చనిపోతే ఎంతమంది చనిపోయారో, ఎంతమంది గాయపడ్డారో 14 గంటల వరకూ సమాచారం బయటికి రాలేదు. కానీ, ఏరోజుకు ఆరోజు ఎంతమంది స్నానాలు ఆచరించారో ఠంచనుగా లెక్కలు విడుదల చేశారు. ఇంత పెద్ద కార్యక్రమంలో తొక్కిసలాట మామూలేనంటూ ఆ రాష్ట్రమంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. నదీజలం తీవ్రంగా కలుషితమైందని, ప్రమాదకరమైన బ్యాక్టీరియాతో నిండిపోయిందని సాక్షాత్తూ ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ పరిశోధనపూర్వక నివేదికను వెల్లడిస్తే- అదంతా తప్పన్నట్టు ముఖ్యమంత్రి యోగి కొట్టిపారేశారు. నదీజలం స్నానానికే కాదుబీ తాగటానికి కూడా స్వచ్ఛంగా ఉందంటూ ఉద్ఘోషించారు. కుంభమేళాలో స్నానమాచరించని రాహూల్‌గాంధీ, ఉద్ధవ్ థాకరేకి హిందువులు ఓట్లు వేయరాదంటూ కేంద్రమంత్రి రాందాస్ అథవాలే అథమస్థాయి వ్యాఖ్యలు చేశారు.

నోట్లరద్దుతో క్యూలో నిల్చొని జనం ప్రాణాలు వదిలినప్పుడు, ఆకస్మిక లాక్‌డౌన్‌తో కోట్లాదిమంది కార్మికులు నానా ఇక్కట్లూ పడినప్పుడు, రోడ్లపై నడుస్తూనే ప్రాణాలు కోల్పోయినప్పుడు, మణిపూర్‌లో మహిళలను నగంగా ఊరేగించి, హత్యాచారాలకు పాల్పడినప్పుడు నోరు విప్పని, క్షమాపణ కోరని ప్రధాని మోడీ %ొ% కుంభమేళాలో జరిగిన అసౌకర్యాలకు చింతిస్తూ, క్షమాపణలు కోరారు. ఇదంతా దేనిని సూచిస్తోంది? భక్తుల విశ్వాసాలను రాజకీయ లబ్ధిగా మార్చుకునే బిజెపి కుటిల, కుత్సిత, స్వార్థబుద్ధిని బయట పెడుతోంది. ప్రజలను మతం పేరిట విడదీసి, పబ్బం గడుపుకునే ఏహ్యమైన పాచిక కనపడుతోంది. దైనందిన బతుకులో భారాలకు, సమస్యలకు కారణమవుతూ, మతవిశ్వాసాలు, ఉద్వేగాల హంగామాతో దానిని మభ్యపెట్టాలని పాలకుల పన్నాగం. ప్రజలు దానిని అర్థం చేసుకోలేరనుకుంటే అది అజ్ఞానమే అవుతుంది.

# ధరాభారం.. మద్దతు దూరం



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల
ఫౌండర్,చైర్మన్

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

దేశానికి రైతే వెన్నెముక అంటూనే,ఆ వెన్నెముకను విరిచే విధానాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. అధికార మార్పిడి జరిగిన నాటి నుండి నేటి వరకు రైతాంగ ప్రయోజనాలు కాపాడే వ్యవసాయ విధానాలను పాలక పార్టీలు,ప్రభుత్వాలు అమలు జరపకపోగా హరిస్తున్నాయి. పండించే పంటలకు న్యాయమైన ధర లభించకపోతే రైతుకు నష్టదాయకంగా మారి సేద్యమే సంక్షోభంలో పడుతున్నది. నేడు భారత రైతాంగం ఈ సమస్యనే ఎదుర్కొంటున్నారు. నెహ్రూ పాలనలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే విధానాలు అమలు చేయని ఫలితంగా దేశంలో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడింది. అవమానకరమైన పిఎల్ 480 ఒప్పందం ద్వారా అమెరికా నుండి పెద్దఎత్తున గోధుమలు దిగుమతి చేసుకున్నాం. ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచే విధంగా రైతాంగానికి మేలు రకమైన విత్తనాలు, పంటకు కావాల్సిన పెట్టుబడి, నాణ్యమైన ఎరువులు, మంచి ధర లభించే మార్కెట్ సౌకర్యం కల్పించి ఉంటే ఆహార సంక్షోభం వచ్చేది కాదు. మద్దతు ధరల నేపథ్యం భారత వ్యవసాయరంగాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటానికి అనుగుణమైన విధానాలను అమెరికా అమలు జరిపింది. మొదట ముక్కిపోయిన గోధుమలను భారత దేశానికి ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంది. తమ దేశ ఎరువుల రంగానికి భారత దేశాన్ని పెద్ద మార్కెట్‌గా మార్చే వ్యూహాత్మక విధానాలకు సిద్ధమైంది. అందుకు ఫోర్డు ఫౌండేషన్‌ను ఉపయోగించింది. 1959లో భారత దేశానికి వచ్చిన ఈ ఫౌండేషన్ నాట్లు వేయటానికి ముందే పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని భారత ప్రభుత్వానికి సూచించింది. దానికి అనుగుణంగానే వ్యవసాయ ధరల కమిషన్ ఏర్పాటు కోసం 1964లో ఎల్‌కె ఝా అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. దాని సిఫార్సుల ఆధారంగా 1965లో వ్యవసాయ ధరల కమిషన్ (ఎపిసి) ఏర్పడింది. ఇది ప్రతి సంవత్సరం మద్దతు ధర, సేకరణ గురించి ప్రకటిస్తుంది. ఎసిపిని 1985లో వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌గా కేంద్ర ప్రభుత్వం మార్చింది. ముందుగానే మద్దతు ధర ప్రకటించమని ఫోర్డు ఫౌండేషన్ చెబితే, పంటల దిగుబడి పెంచటానికి సస్యవిప్లవం ప్రకటించమని ప్రపంచబ్యాంకు భారత ప్రభుత్వానికి చెప్పింది. సస్యవిప్లవం పేరుతో అమెరికా కంపెనీల ఎరువుల, పురుగు మందుల వ్యాపారానికి భారత దేశాన్ని ముఖ్య కేంద్రం గా మార్చటమే ప్రపంచ బ్యాంకు ఎత్తుగడ. ప్రపంచ బ్యాంకు సూచనలకు అనుగుణంగా 1966లో దేశంలో సస్యవిప్లవాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా నుంచి హైబ్రీడ్ విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు దేశంలోకి దిగుమతి అయ్యాయి. సస్యవిప్లవ ఫలితంగా రైతాంగానికి పంట ఖర్చులు పెరిగాయి. అందుకు తగ్గ ఆదాయం మాత్రం రైతాంగానికి లభించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలకు మద్దతు ధర అంశం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా జరుగుతున్న చర్చ లో విధాన నిర్ణేతలు, పరిశోధకులు, ఆలోచనాపరులు ప్రభుత్వ పెట్టుబడులు లేదా ఇన్‌పుట్ సబ్సిడీల ద్వారా ఉత్పత్తి వ్యయానికి మద్దతు మార్గాలను సూచించారు. 1964లో ఎల్‌కె ఝా కమిషన్ సిఫార్సుల మేరకు రైతాంగానికి మద్దతు ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం స్వీకరించింది. ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర విధానం ఒక నిర్దిష్ట పంట ఉత్పత్తి వ్యయాన్ని అంచనా వేయటానికి అనుసరించే విధానాలను వ్యవసాయ ఖర్చుల ధరల కమిషన్ (సిఎసిపి) ప్రచురించిన వార్షిక ధరల విధాన నివేదిక లో పేర్కొన్నారు. ఈ నివేదిక ప్రకారం సిఎసిపి భారత దేశంలో ప్రధాన పంటల సాగు ఖర్చును అధ్యయనం చేయటానికి ‘సమగ్ర పథకాన్ని’ 1971 నుండి అమలు చేసింది. ఈ పథకం ద్వారా మూడు సంవత్సరాల ఖర్చులను కలిపి పంటల ఉత్పత్తి ఖర్చును వ్యవసాయ ధరల కమిషన్ నిర్ణయిస్తుంది. ఈ విధానం రైతాంగ ప్రయోజనాలను దెబ్బ తీస్తుంది. రెండు సంవత్సరాల పంట ఖర్చులు తక్కువా ఉంటే, ఆ ఖర్చును మూడవ సంవత్సరం పంట ఖర్చులతో కలిపి నిర్ణయించటం వలన పంట ఖర్చు తక్కువగా నమోదు అవుతుంది. దాన్ని ఆధారం చేసుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర తక్కువ ప్రకటిస్తుంది. అంతేకాకుండా పంటల ఉత్పత్తి ఖర్చును రాష్ట్రాల వారీగా సేకరించి దానిని దేశ సగటుగా నిర్ణయించటం జరుగుతున్నది. ఒక పంటకు సాగు ఖర్చులో రాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఉంది. దీనివల్ల ఎక్కువ ఖర్చు ఉన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతున్నది. ప్రతి సంవత్సరం రాష్ట్రాల వారీగా పంట ఖర్చును లెక్కించి ఆయా రాష్ట్రాలకు విడిగా మద్దతు ధరను ప్రకటిస్తే రైతాంగానికి ప్రయోజనంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అలా చేయకపోవటం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఒక పంటకు ఉత్పత్తి వ్యయం అనేది పంట కోసం పెట్టిన ఖర్చు, భూమి అద్దె, కుటుంబ శ్రమ, అప్పులకు వడ్డీ, మూలధనంపై వడ్డీ తదితరాలు లెక్కించి నిర్ణయించాలి. అది సమగ్రంగా ఖర్చుగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వాలు, వ్యవసాయ వ్యయ ధరల కమిషన్ ఆ విధంగా పంట వ్యయాన్ని లెక్కించటం లేదు. బ్యాంకులు ఇచ్చే పంట రుణం ప్రామాణికంగా తీసుకుని పంటకు మద్దతు ధరను ప్రకటిస్తున్నాయి. ఫలితంగా రైతాంగానికి సేద్యం గిట్టుబాటుకాక అప్పుల్లో కూరుకు పోతున్నారు. వివిధ కమిషన్ల సూచనలు: ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని జాతీయ రైతు కమిషన్ (ఎన్‌సిఎఫ్) కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) సగటు ఉత్పత్తి వ్యయంకంటే (పంట ఖర్చు, కౌలు ఖర్చు, కుటుంబ శ్రమ, అప్పులకు వడ్డీ మొదలైన ఖర్చులు) కనీసం 50% ఎక్కువగా ఉండాలని సిఫార్సు చేసింది. 1979 - 80లో ఉత్పత్తి వ్యయం అంచనాలపై ప్రత్యేక నిపుణుల (యస్‌ఆర్ సేన్) కమిటీ, 1990లో ఏర్పాటు చేయబడిన పంటల ఉత్పత్తి వ్యయ పద్ధతి సమీక్ష కోసం నిపుణుల (సిహెచ్ హనుమంతరావు అధ్యక్షతన) కమిటీ, పంటల వ్యయం గురించి సిఎసిపి ఉపయోగించిన పద్ధతికి సంబంధించిన



అనేక సమస్యలు లేవనెత్తాయి. సేన్, భాటియా (2004) కమిటీలు కూడా యాజమాన్యంలోని భూమి అద్దె విలువను కూడా ఉత్పత్తి వ్యయంలో లెక్కించబడుతుందని ఎత్తిచూపారు. భూయజమాని మూలధనంపై వడ్డీ ఖర్చు 10%గా అంచనా వేసింది. ఈ సిఫార్సులను ప్రభుత్వాలు, సిఎసిపి పరిగణనలోకి తీసుకోలేదు. 2014లో మోడీ నాయకత్వాన మొదటిసారి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడినప్పుడు 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పింది. ఇంతవరకు ఆచరణలో అమలు జరగకపోగా నేడు దాని ఊసే ఎత్తటం లేదు. రైతుల ఆదాయం పెరగకపోవటం పైన, మద్దతు ధరల పైన మోడీ ప్రభుత్వంపై వివిధ రూపాల్లో వ్యతిరేకత పెరుగుతూ ఉండటంతో, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా పంట ఉత్పత్తి వ్యయంపై అదనంగా 50% పెంచి మద్దతు ధరను ప్రకటిస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడే మోడీ ప్రభుత్వ వంచన బయటపడింది. స్వామినాథన్ కమిషన్ చెప్పినట్లు అన్ని రకాల ఖర్చులను లెక్కించకుండా, ఒక్క పంట ఖర్చునే తీసుకుని దానిపై 50% పెంచి మద్దతు ధరను ప్రకటిస్తున్నది. 2024 -25 సంవత్సరానికి ఎకరా సేద్యపు పంట ఖర్చు 28 వేలుగా నిర్ధారించి, సగటు దిగుబడి 20 క్వింటాళ్లు నిర్ణయించి, క్వింటాల్ ఉత్పత్తి ఖర్చు రూ. 14 వందలు పేర్కొని దానిపై 50% పెంచి 2100 రూపాయలుగా ప్రకటించి దాన్ని 2300 రూపాయలకు పెచింది. పంట ఖర్చు, కౌలు ఖర్చు, కుటుంబ శ్రమ, అప్పుల వడ్డీలతో వాస్తవ వ్యయం రూ. 64 వేలు. క్వింటాల్ ఉత్పత్తి ఖర్చు రూ. 3200. దానిపై 50% కలిపితే 4,800 రూపాయలుగా మద్దతు ధర ప్రకటించాలి. దీన్ని గమనించినప్పుడు స్వామినాథన్ సిఫార్సులను మోడీ ప్రభుత్వం వక్రీకరించి విధానం తెలుస్తుంది. మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించటానికి నిరాకరిస్తున్నది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, మద్దతు ధర 50% పెంచుతానని మోసపుచ్చుతూ వచ్చిన మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాల ద్వారా మద్దతు ధరలకే మంగళం పాడి పంటల సేకరణ నుంచి తప్పుకుంటే, ఆ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమం ఉవ్వెత్తున సాగటంతో, చట్టాలను ఉపసంహరించుకోక తప్పలేదు. స్వతంత్ర పాలన ప్రారంభం నుండి నేటి వరకు పాలక ప్రభుత్వాలన్నీ రైతాంగ వ్యతిరేక విధానాలనే అనుసరించాయి. రైతాంగ ప్రయోజనాలను హరించి, బడా వ్యాపారుల ప్రయోజనాలకు అనుకూలంగా పంటల మద్దతు ప్రకటిస్తున్నాయి. గిట్టుబాటు గాని ధరల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయారు. నాలుగు లక్షల మంది రైతులు అప్పులు తీర్చే మార్గం కనపడక బలవన్మరణాల పాలయ్యారు. రైతాంగం, రైతు, రైతు కూలీ సంఘాలు పంటలకు న్యాయబద్ధమైన మద్దతు ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించి, ప్రభుత్వమే కొనుగోళ్లు చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాలు చేస్తున్నాయి. ఆ ఉద్యమాలను ఉధృతం చేసి మోడీ ప్రభుత్వం దిగి వచ్చేలా చేయాలి. అప్పుడే న్యాయమైన మద్దతు ధర లభిస్తుంది.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

## పదవీవిరమణ పొందిన పోలీసులకు సన్మానం



**హనుమకొండ: (జై భీమ్ న్యూస్)**

వరంగల్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారులు ఏసీపీ భోజరాజు,ఎస్. ఐ లు సాధిక్ అలీ , రవీందర్, మధు బాబులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మీసేవలను నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయని పదవీ విరమణ తర్వాత కూడా మీ గౌరవం తగ్గదని, ఆరోగ్యం శ్రద్ద వహించాలని నిత్యం వ్యాయామం కొరకు కొద్ది సమయాన్ని కేటాయించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, సురేష్ కుమార్, ఏసీపీలు నాగయ్య , సురేంద్ర, సత్యనారాయణ, ఆర్.ఐలు సతీష్, శ్రీనివాస్, స్పర్జన్ రాజ్ ఆర్. ఎస్. ఐ శ్రవణ్ తో పాటు పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మురికివాడల నివాసితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి పత్రం సమర్పించిన కృష్ణప్ప



**బెంగళూరు, జై భీమ్ న్యూస్ :**

బెంగుళూరు నగరంలోని సివి రామన్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నాగవరపాళ్య మురికివాడల నివాసితులకు పునరావాసం కల్పించడానికి భీమా సంఘటన మహా కూటమి నాయకులు 650 కుటుంబాల గురించి చర్చించడానికి శుక్రవారం బెంగళూరు కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. కన్నాల్లి కృష్ణప్ప మాట్లాడుతూ బెంగుళూరు తూర్పు తాలూకలోని బెన్నిగనహల్లి చేతన్ సినిమా థియేటర్ సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వే నెం.193కి సంబంధించి కర్ణాటక కొలగేరి డెవలప్‌మెంట్ బోర్డ్ కింద ఇవ్వాలని సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో నాగవరపాళ్య మురికివాడల నివాసితులకు పునరావాసం కోసం బోర్డు చట్టంలోని సెక్షన్-11 ప్రకారం డిక్లరేషన్ జారీ చేయడం గురించి గౌరవనీయ కలెక్టర్‌కు వినతి పత్రం లేఖలో వివరించామని తెలిపారు. ఈ ప్రాంతంలోని అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసేటప్పుడు భీమా సంఘటన మహా కూటమిని విశ్వాసంలోకి తీసుకోవాలని మేము వారిని అభ్యర్థిస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమా సంఘటన మహా కూటమి రాజ్య అధ్యక్షుడు కె మరియప్ప, గౌరవ అధ్యక్షుడు హెబ్బల వెంకటేష్, కనల్లి కృష్ణప్ప, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

**బెంగళూరు, జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక రాష్ట్రంలోని మహదేవ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బిదరహల్లి హోబలి కురుడు సొన్నెహల్లిలోని శ్రీ శివలింగేశ్వర స్వామి ఆలయలో వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థాపకుడు మునిరాజు స్వామి. ప్రజ్వల్ మరియు కార్తీక్ ప్రధాన అర్చకులు మహాశివరాత్రి మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే అరవింద్ లింబావలి ప్రత్యేక పూజా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు మంజునాథ, కేశవ్. ముని రామయ్య.వెంకట. దినేష్. లోకేష్. ముకుంద, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 వేల భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి జాగరణ లో శివ కథనం, సంగీత్, భరతనాట్యం కార్యక్రమాలు చేపట్టారు.



# ఆడాళ్లూ.. మీకు జోహార్లు

**ఒకవైపు ఇంటి పని..మరోవైపు ఉద్యోగం**
**ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తున్న మహిళలు**
**ఎంప్లాయిమెంట్‌లో 25 శాతానికి పెరిగిన భాగస్వామ్యం**
**ఇంట్లోవారి కోసం రోజుకు 289 నిమిషాలు**
**88 నిమిషాలకే పరిమితమైన పురుషులు**
**జాతీయ గణాంకాల కార్యాలయ సర్వే**

**న్యూఢిల్లీ(జై భీమ్ న్యూస్)**

ప్రస్తుతం దేశంలో అన్ని రంగాల్లోనూ మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారు.సమాజంలో వారికి ఎన్ని అడ్డంకులున్నా..అటు ఇంటి పనులను,ఇటు ఉద్యోగ బాధ్యతలను చూసుకుంటున్నారు.ఉద్యోగం, సంబంధిత కార్యకలాపాలలో పురుషులతో పాటు మహిళల భాగస్వామ్యమూ పెరిగింది.ఇందుకు ఎక్కువ సమయాన్నే కేటాయిస్తున్నారు.అలాగే,ఇంటి పనులకు కేటాయించే సమయం కాస్త తగ్గినా..పురుషులతో పోలిస్తే అది చాలా ఎక్కువగానే ఉన్నది. గతేడాదికి సంబంధించి 15-59 ఏండ్ల వయస్కుల్లో జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) జరిపిన 'టైమ్ యూజ్ సర్వే'లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

**సర్వేలో 4.54 లక్షల మంది..**

వివిధ పనులపై వ్యక్తులు వెచ్చించిన సమయాన్ని ఈ సర్వే వివరించింది. ఇది 1,39,487 ఇండ్లను కవర్ చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 83,247 ఇండ్లు, పట్టణ ప్రాంతాల నుంచి 56,240 గృహాలు ఉన్నాయి. ఆరేండ్ల వయస్సు పైబడినవారు 4,54,192 మంది సర్వేలో పాల్గొన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 2.85 లక్షల మందికి పైగా, పట్టణ ప్రాంతాల నుంచి 1.68 లక్షల మందికి పైగా ఉన్నారు.

**ఇంటి పనులకు రోజుకు 305 నిమిషాలు..**

ఈ సర్వే సమాచారం ప్రకారం.. ఉద్యోగ, ఉపాధి సంబంధిత పనుల్లో మహిళల భాగస్వామ్యం పెరిగింది. 2019లో ఇది 21.8 శాతంగా ఉంటే.. 2024 నాటికి అది 25 శాతానికి చేరింది. పురుషుల విషయంలో 2019లో 70.9 శాతంగా ఉన్న భాగస్వామ్యం.. గతేడాది 75 శాతానికి పెరిగింది. చెల్లింపులకు నోచుకోని గృహ సేవలకు మహిళలు వెచ్చించిన సమయం 2019లో రోజుకు 315 నిమిషాలు ఉండగా.. అది గతేడాదికి 305 నిమిషాలకు తగ్గింది. పురుషులతో పోలిస్తే ఇది చాలా ఎక్కువే అని చెప్పొచు. ఇది.. మహిళలు ఇలాంటి గృహ సేవల నుంచి చెల్లింపులకు నోచుకునే ఉద్యోగ, ఉపాధి కార్యకలాపాల వైపునకు మళ్లారని తెలియజేస్తున్నదని మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ తెలిపింది.

**ఉద్యోగ సంబంధిత పనులకు 341 నిమిషాలు..**

ఇంటి పనులతో పాటు ఉద్యోగ, ఉపాధి సంబంధిత పనులకూ మహిళలు ప్రాధాన్యతనిస్తున్నారు. 2024లో ప్రజలు ఇందుకు రోజుకు 440 నిమిషాలు వెచ్చించారు. పురుషుల విషయంలో ఇది 473 నిమిషాలుగా ఉండగా.. మహిళలది 341 నిమిషాలుగా ఉన్నది. మహిళలు ఇంట్లో వారి కోసం గృహ సేవల్లో రోజుకు 289 నిమిషాలు పని చేశారు. ఇది పురుషుల విషయంలో 88 నిమిషాలే కావటం గమనార్హం.

**కుటుంబ సంరక్షణలో ఆమెనే ముందు..**

కుటుంబం విషయంలో మహిళ ప్రాధాన్యత ఈ సర్వేలో వెల్లడైంది. ఇంట్లోవారి సంరక్షణ విషయంలో మహిళల భాగస్వామ్యంతో పాటు వారు వెచ్చించే సమయం కూడా పురుషులతో పోలిస్తే దాదాపు రెండు రెట్లు ఎక్కువగా ఉన్నది. కుటుంబీకుల సంరక్షణ కోసం మహిళలు 137 నిమిషాలు, పురుషులు 75 నిమిషాలు వెచ్చించారు. 15 ఏండ్లకు పైబడిన దాదాపు 41 శాతం




మంది మహిళలు వారి కుటుంబీకుల సంరక్షణలో పాలు పంచుకున్నారు.

ఇది పురుషుల విషయంలో 21.4 శాతంగానే ఉండటం గమనార్హం. సంరక్షణ కార్యకలాపాలకు మహిళలు రోజుకు 140 నిమిషాలు కేటాయిస్తే.. పురుషులు మాత్రం 74 నిమిషాలకే పరిమితమయ్యారు. కుటుంబీకుల సంరక్షణను చూసే బాధ్యతను మహిళలే చూసుకుంటున్నారన్న దృగ్విషయాన్ని ఇది తెలియజేస్తున్నదని సంబంధిత మంత్రిత్వ శాఖ తెలిపింది.

**నేర్చుకోవటానికి 413 నిమిషాలు..**

సర్వేలో పాల్గొన్నవారిలో దాదాపు 16.8 శాతం మంది తమ తుది ఉపయోగం కోసం వస్తువులను ఉత్పత్తి చేయటంలో పాలు పంచుకున్నారు. ఇందుకు రోజులో 116 నిమిషాలు వెచ్చించారు. ఆరు నుంచి 14 ఏండ్ల మధ్య వయస్సున్న చిన్నారులు రోజుకు 413 నిమిషాలు నేర్చుకోవటానికి సంబంధించిన పనులపై వెచ్చించారు. ఆరేండ్లు, అంత కంటే ఎక్కువ వయసున్నవారు రోజుకు 171 నిమిషాలు సంస్కృతి, విశ్రాంతి, మాస్ మీడియా ఉపయోగంపై గడిపారు. ఈ అంశాలపై పురుషులు 177 నిమిషాలు, మహిళలు 164 నిమిషాలు వెచ్చించారు.

# వరంగల్ వాసులకు దశాబ్దకాలం కోరిక నేరవేరింది

**మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**
**మా సీఎం రేవంతన్న కష్టం... వరంగల్ జిల్లా ప్రజల అదృష్టం ఇది**
**మంత్రి కొండా సురేఖ వెల్లడి**

**హైదరాబాదు: (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జిల్లా వాసులకు దశాబ్ద కాలం కోరిక నేరవేరిందని తెలంగాణ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. ఇది తమ సీఎం రేవంతన్న, ఉన్నతాధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు వరంగల్ జిల్లా ప్రజల అదృష్టమని ఆమె వ్యాఖ్యానించారు. వరంగల్ జిల్లా వాసులు గాల్లో తేలే వార్త ఇది అని పేర్కొన్నారు. ఓరుగల్లు వాసులు ఎళ్ల తరబడి ఎదురుచూస్తున్న కలను నెరవేర్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది అన్నారు. మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చాక మంత్రి కొండా సురేఖ శుక్రవారం మీడియాకి ఒక ప్రకటన విడుదల చేశారు. మమునూరు ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయం అన్నారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ అంశంపై తీవ్రంగా చేసినట్టు చెప్పారు. మామునూరు విమానాశ్రయాన్ని అతి త్వరగా అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆమె వెల్లడించారు. ఈక్రమంలోనే.. మామునూరు ఎయిర్ పోర్టుకు సంబంధించిన భూసేకరణ విషయంలో తమ ప్రాంత ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున సహకారం అందించాలని చెప్పారు. మామునూరు ఎయిర్ పోర్టును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రేవంత్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని కొనియాడారు. జిల్లా మంత్రిగా తాను జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి.. మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ నిమిత్తం స్థల పరిశీలన పలుమార్లు చేసినట్టు చెప్పారు. ఆ సందర్భంలో... గాడిపల్లి గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామస్తులతో మంత్రి హోదాలో సమావేశమై విమానాశ్రయ ఏర్పాటుకు కావల్సిన 253 ఎకరాల భూసేకరణ నిమిత్తం రైతులతో సంప్రదింపులు జరిపినట్టు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వరంగల్ జిల్లా మొత్తం పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఎస్సీఎస్పీ/టిఎస్పీ పథకం నిధుల దుర్వినియోగానికి వ్యతిరేకంగా నిరసన

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

శుక్రవారం రోజు ఎస్సీఎస్పీ/టిఎస్పీ పథకం నిధుల దుర్వినియోగానికి వ్యతిరేకంగా ఫ్రీడమ్ పార్క్‌లో నిరసన చేపట్టారు. కర్ణాటక ప్రభుత్వ హామీ కార్యక్రమాలు సామాన్యులకు సంబంధించిన కార్యక్రమాలు. కానీ ఎస్సీఎస్పీ/టిఎస్పీ పథకం హామీ పథకం లాంటిది కాదు. సమాజంలోని అణగారిన వర్గాలు ఇతర వర్గాలతో పోలిస్తే అన్ని విధాలుగా వెనుకబడి ఉన్నందున, ఈ పథకం రూపొందించబడింది మరియు దళితులు మరియు దళితేతరుల మధ్య అసమాన అంతరాన్ని తగ్గించి, వారిని సమాజంలోని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే దీని ప్రధాన లక్ష్యం. దళితులకు సామాజిక ఆర్థిక సాధికారత కల్పించడమే. కానీ ఈ పథకం చాలా దుర్వినియోగం చేయబడుతోంది మరియు దీని ప్రధాన ఉద్దేశ్యం దెబ్బతింటోంది. 2024-25 కోసం ఎస్సీఎస్పీ/టిఎస్పీపథకం రూ. 39,121 కోట్లు కేటాయించారు. వెబ్‌సైట్ ప్రకారం, జనవరి 2025 వరకు, దీనికి ఖర్చు చేసిన డబ్బు కేవలం రూ. 21,746 కోట్లు. అంటే రూ. 17,375 కోట్లు ఇంకా విడుదల చేయలేదు లేదా ఖర్చు చేయలేదు. 2024-25 సంవత్సరానికి కేటాయించిన డబ్బులో జనవరి చివరి నాటికి 56శాతం మాత్రమే ఖర్చు చేశారు. తరువాతి రెండు నెలల్లో, మిగిలిన డబ్బును హడావుడిగా ఖర్చు చేస్తారు లేదా, చట్టం పేర్కొన్నట్లుగా, మిగిలిన డబ్బును తదుపరి సంవత్సరానికి తరలించి, కొట్టుకుపోతుంది. అక్కడ ఈ ప్రాజెక్టు ఆశ మట్టి లాంటిది. దళితులకు అత్యధిక నిధులు కేటాయించాల్సిన సాంఘిక సంక్షేమ శాఖ కేవలం 4174 కోట్లు మాత్రమే కేటాయించి మూడో స్థానానికి దిగజారింది. గ్యారెంటీ పథకానికి కావాల్సిన డబ్బు ధనికుల జేబుల్లోంచి తీసుకోవాలి తప్ప దళితుల పొట్ట, బట్ట, బతుకు తీయకూడదు. ఇది సామాజిక న్యాయం కాదు, సిద్ధరామయ్య ప్రభుత్వానికి కీర్తిని తీసుకురాదు. సాంఘిక సంక్షేమ శాఖ డా. హెచ్.సి. మహదేవప్ప కూడా విఫలమయ్యారు. ఆ డబ్బును దళితుల అభ్యున్నతికి ఉపయోగించకపోతే దళితుల తలపై అందరూ జలగలు వేసినట్లే అవుతుంది. దళితులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని దేశంలోనే తొలిసారిగా అమలు చేసిన ఎస్సీఎస్పీ/టిఎస్పీ పథకం కోరికను సిద్ధరామయ్య స్వయంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మరియు లౌకికవాదం పట్ల మీకున్న శ్రద్ధ, సామాజిక న్యాయం పట్ల మీ నిబద్ధతను మేము హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాము. అదనంగా, వారు అమలు చేసిన హామీ పథకాలను మరియు క్రింది చర్యల ద్వారా కొనసాగించాలని మేము డిమాండ్ చేస్తున్నాము.

1. హామీ పథకాలకు ఎస్సీఎస్పీ/టిఎస్పీ పథకం నిధుల వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలి.

2 . ఎస్సీఎస్పీ/టిఎస్పీ చట్టంలోని సెక్షన్ 7డి రద్దు చేయబడినందున, సెక్షన్ 7బి మరియు 7సి లను కూడా సవరించాలి మరియు రద్దు చేయాలి.

3. ఆర్టికల్ 46 ప్రకారం విద్యా, ఆర్థిక అభివృద్ధికి ఉపయోగించాలన్న రాజ్యాంగం కోరికను అమలు చేయాలి.

4. 2014 నుండి 2025 వరకు ఎస్సీఎస్పీ/టిఎస్పీ పథకం కింద ఇప్పటికే ఖర్చు చేసిన డబ్బు మూల్యాంకనం కోసం అభివృద్ధి శ్వేతపత్రం జారీ చేయాలి.

5. అన్ని శాఖల కింద వచ్చే ఎస్సీఎస్పీ/టిఎస్పీ నిధులను షెడ్యూల్డ్ జనాభా ప్రకారం వర్గీకరించాలి మరియు కమ్యూనిటీ అభివృద్ధి ప్రాజెక్టులకు కేటాయించాలి.

6. జనాభా ప్రాతిపదికన కేటాయించబడిన 101 కులాలకు ఎస్సీఎస్పీ/టిఎస్పీ పథకం కింద షెడ్యూల్డ్ డెవలప్‌మెంట్ గ్రాంట్‌ల అమలు.

7. ఎస్సీఎస్పీ/టిఎస్పీ పథకంలో 30 శాతం ప్రాథమిక మరియు ఉన్నత విద్య మరియు నివాస విద్యపై ఖర్చు చేయడం.

8. కాంట్రాక్టు పౌర కార్మికులు, చెత్త ఏరుకునే వారికి డిపిఎస్ కింద అన్ని మౌలిక సదుపాయాలను తీసుకురావడం.

9. బాబు జగ్జీవన్ రామ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అంబేద్కర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఒక్కొక్కరికి రూ.1000 కోట్లు మరియు లిడ్కర్, సఫాయి కర్మచారి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు కనీసం రూ.300 కోట్లు కేటాయించి పథకం అమలు.



## తీవ్ర విషాదం... ఎస్ఎల్బీసీ టన్నెల్ లో చిక్కుకున్న ఎనిమిది మంది సజీవసమాధి

**టన్నెల్ లో 3 మీటర్ల లోతు బురదలో మృతదేహాలు**
**ఆధునిక పరికరాలు, రాడార్ల సాయంతో మృతదేహాల గుర్తింపు**
**మృతుల్లో ఇద్దరు ఇంజినీర్లు, ఆరుగురు కార్మికులు**




హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది ప్రాణాలతో బయటపడతారని అందరూ ఆశించారు. కానీ ఈ ప్రమాదం చివరకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. టన్నెల్ లో చిక్కుకున్న ఎనిమిది మంది సజీవ సమాధి అయ్యారు. టన్నెల్ లో 3 మీటర్ల లోతు బురదలో వీరి మృతదేహాలను గుర్తించారు. అత్యాధునిక పరికరాలు, రాడార్ల సాయంతో మృతదేహాలను గుర్తించడం జరిగింది. మృతదేహాల గుర్తింపులో ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం కీలక పాత్ర పోషించింది. మృతి చెందిన వారిలో ఇద్దరు ఇంజినీర్లు కాగా, మిగిలిన ఆరుగురు కార్మికులు. టన్నెల్ లో చిక్కుకున్న అందరూ మరణించారని నిర్ధారణ కావడంతో అక్కడ తీవ్ర విషాదం నెలకొంది. ఏడు రోజుల క్రితం గత శనివారం టన్నెల్ లో ప్రమాదం చోటుచేసుకుంది.

## జర్నలిస్టులకు ప్రమాద బీమా కల్పించడం సంతోషకరం

**కలెక్టర్ సత్య ప్రసాద్**
**టీఎస్ జేయు ఆధ్వర్యంలో జర్నలిస్టుల అటాక్స్ కమిటీ పునరుద్ధరించడానికి వినతి పత్రం అందజేత**





జగిత్యాల జిల్లా జై భీమ్ న్యూస్

జర్నలిస్టులపై దాడులకు సంబంధించిన కమిటీని పునరుద్ధరించాలి అని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సత్య ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో యూనియన్ అంద చేస్తున్న ఉచిత ప్రమాద బీమా పత్రాలను సభ్యులకు శుక్రవారం కలెక్టర్ అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టులకు టిఎస్ జేయు ఇస్తున్నటువంటి 5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా ఇవ్వడం ఆ సంతోషకరమని అన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు ఆ సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ... జర్నలిస్టులకు గల సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జర్నలిస్టులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ నీ కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్,రాష్ట్రా ఆర్గనైజింగ్ సెక్రటరీ అవునూరి సంపత్, కోరుట్ల నియోజకవర్గ కమిటీ గౌరవ అధ్యక్షులు దీకొండ మురళి, అధ్యక్షులు జోరిగే శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, కోశాధికారి ఓంకారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి కోయాల్కర్ నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ దివాకర్, మీడియా ఇంచార్జి నన్నాపురజ్ రవిరాజ్, ఈసీ మెంబర్లు పండిత్ రాజేందర్, సయ్యద్ ఫిరోజ్,గట్ల శ్రీనివాస్,దూది గణేష్, సభ్యులు మద్దెనపల్లి నాగేష్, బెజ్జరాపు శ్రీకాంత్, దగ్గుల అశోక్, బెజ్జరాపు శ్రీనివాస్, చొక్కాల రవీందర్, సుద్దాల హరీష్, వెంకటరమణ, గుండవేణి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేయు పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన డిసిపి సెంట్రల్ జోన్ ఎస్ కె సలీమా ఐపిఎస్

వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్

వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలోని కెయూసి పోలీస్ స్టేషన్ తో పాటు స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ ప్రమాద స్థలాలను డిసిపి సెంట్రల్ జోన్ ఎస్ కె సలీమా ఐపిఎస్ ఆకస్మిక తనిఖీలు చేసారు. తద్వారా పోలీస్ స్టేషన్ లోని పిర్యాదుదారులతో మాట్లాడారు. అనంతరం శాంతిభద్రతల సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ రవి కుమార్, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# నేషనల్ సైన్సు డే పాల్గొని ప్రసంగిస్తున్న ప్రముఖులు

హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్



ప్రపంచానికి గొప్ప శాస్త్రవేత్తలను అందిచిన దేశం భారతదేశం అని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు, జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ అధ్యక్షతన, సెనెట్ హాల్ లో నిర్వహించిన ఒక రోజు జాతీయ సదస్సులో ముఖ్య అతిదిగా పాల్గొని, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు, ఆర్యబట్ట, వరహమిర, భాస్కరా, చరక లాంటి శాస్త్రవేత్తలను అందించిన దేశం అన్నారు, సర్ సివి. రామన్ లాంటి నోబెల్ శాస్త్రవేత్తలను అందించిన దేశం అన్నారు, పరిమిత వనరులు, ప్రయోగ శాలల తో ముందుకు వెళ్ళాం అన్నారు, భారత దేశ ప్రగతి సైన్సు పై ఆధార పడి ఉంది అన్నారు, ఉత్సుకత తో ఏదైనా సాధ్యం అన్నారు, సర్ రోనాల్డ్ రోస్ లాంటి గొప్ప గొప్ప వ్యక్తులు అందుబాటు లో ఉన్న వనరులు, వసతులతో గొప్ప గొప్ప సమాజహిత పరిశోధనలు తీసుకోని వచ్చారు అని, హైదరాబాద్ సి మెట్ పూర్వపు సంచాలకులు ఆచార్య ఎన్. ఆర్. మునిరత్నం మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే, తక్కువ ఖర్చు, దేశీయ టెక్నాలజీతో ఎన్నో అద్భుతాలు సృష్టించ వచ్చు అన్నారు, ఒక చిన్న పిన్నీస్ కుడా సృజనతోనే వచ్చింది అన్నారు, గొప్పతనం ఏమిటి అంటే అది తయారైన తరువాత ఎటువంటి మార్పులకు లోను కాలేదు అన్నారు, భారతదేశం లో 120 పైగా యునికార్న్ కంపని లు, స్టార్ట్ అప్ లు ఉన్నాయి అన్నారు, ప్రాజెక్ట్ తయారీ ప్రారంభం లో యువ పరిశోధకుడు పరిశోధన పై స్వాట్ ఎనాలసిస్ చేయాలి అన్నారు, దేశీయంగా ఎన్నో ఆవిష్కరణలు జరిగాయి అన్నారు, విలువైన మూలకాల లభ్యత జరిగిందన్నారు, పరిశోధన సామర్థ్యాలు ఉంటె ఆవిష్కరణలకు కొదువ లేదు అన్నారు, హైదరాబాద్ ఎన్.జి.ఆర్.ఐ ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ పి. సెంథిల్ కుమార్ మాట్లాడుతూ సైన్సు లో ఉత్సుకత ప్రధానం అన్నారు, ఖగోళ విజ్ఞానం పై ఎన్నో నూతన అంశాలు ముడి పడి ఉన్నయన్నారు. గ్రహాల కదలిక, నివాసయోగ్యత, వాతావరణం ఇవి అన్ని భూగ్రహం పై నుంచి పరిశోధనకు మూలం అయినవి అన్నారు, అందరి కృషి తో భుగ్రహాన్ని కాపాడుకోవాలి అన్నారు. భూమి మీద మాత్రమే మానవ మనుగడకు ఆస్కారం ఎక్కువ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్రుత్వం, క్విజ్ పోటిల విజేతలకు బహుమతులు ప్రధానం చేసారు, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, డీన్ ఆచార్య జి.హనుమంత్, సదస్సు కోఆర్డినేటర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, కాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. మమత ప్రసంగించారు, గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ భారవిశర్మ స్వాగతం పలుకగా, ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీ రాజు వల్లాల వందన సమర్పణ గావించారు, సభ ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన తో పాటు, సి వి రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ బి. రమ, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ అనిత రెడ్డి తో పాటు ఆచార్య ఎన్.ప్రసాద్, ఆచార్య రాజేందర్ కట్ల, ఆచార్య జి.షమిత, డాక్టర్ మంజుల, డాక్టర్ పద్మజ, ఆచార్య సి.జే.శ్రీలత, డాక్టర్ కనీజ్ ఫాతిమా, డాక్టర్ సుజాత, డాక్టర్ టి. శాస్త్రి, డాక్టర్ శ్రీనివాస్ ముంజుంతో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**
**కలెక్టరేట్ లో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం**

హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

మార్చి 21 నుండి ప్రారంభమవుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను చేస్తున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో మొత్తం 12010 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్నారని అన్నారు. ఇందుకుగాను 67 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మార్చి 21 నుండి ఏప్రిల్ 4 తేదీ వరకూ ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణకు 67మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67మంది డిపార్ట్మెంట్ అధికారులు, 67 మంది సిట్టింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో 6339 మంది బాలురు, 5671 మంది బాలికలు మొత్తం 12010 విద్యార్థినీ,విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని విభాగాల శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేస్తున్న నిర్వహణ ఏర్పాట్లను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీఎల్పీఓ గంగాభవాని, పోస్టల్ అధికారి పాపాజీ, ఆర్టీసీ ఆర్ఎం ధరమ్ సింగ్, ఏటీఓ అన్వర్ హుస్సేన్, విద్యుత్ శాఖ అధికారి గంగారెడ్డి, ఎంవిఐ వేణుగోపాల్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కిట్స్ వరంగల్‌లో జాతీయ సైన్స్ డే సెలబ్రేషన్స్

హన్మకొండ జిల్లా (హసన్ పర్తి) జై భీమ్ న్యూస్

సివిల్ సెమినార్ హాల్‌లో సైన్స్‌లో గ్లోబల్ లీడర్‌షిప్ మరియు ఇన్నోవేషన్ కోసం విక్షిత్ భారత్ కోసం భారతీయ యువతకు సాధికారత అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కిట్స్ వరంగల్ లో ఫిజికల్ సైన్సెస్ (పిఎస్) విభాగము వారు సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ రీసెర్చ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ కౌన్సిల్ (ఐఐసి6.%ా%)తో కలిసి సంయుక్తంగా సైన్స్‌లో గ్లోబల్ లీడర్‌షిప్, ఇన్నోవేషన్ కోసం విక్షిత్ భారత్ కోసం భారతీయ యువతకు సాధికారత అనే అంశంపై సివిల్ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంను జాతీయ సైన్స్ డే సందర్భంగా సివిల్ సెమినార్ హాల్‌లో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్, వరంగల్ (కిట్స్ డబ్ల్యు)లో నిర్వహించారని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. దీనిని ముఖ్య అతిథి, ఎన్ఐటీ వరంగల్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పత్రి వెంకట శ్రీలక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, ఎన్ఐటీ వరంగల్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పత్రి వెంకట శ్రీలక్ష్మి మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. కొత్త సవాళ్లు, అవకాశాలను ఎదుర్కోవడానికి తాజా పరిశోధన కార్యకలాపాలను ఆమె వివరించారు. క్వాంటమ్ కంప్యూటింగ్, స్పేస్ ఇంజనీరింగ్, ఆస్ట్రోబయాలజీ యొక్క కొన్ని ఇటీవలి పురోగతులు మరియు అనువర్తనాలను ఆమె వివరించారు. ఘన, వాయు, ద్రవ, జీవ రంగాలకు సంబంధించిన జ్ఞాన వ్యవస్థ కలయిక సైన్స్ అని ఆమె తేల్చింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యను అభిరుచితో అభ్యసించాలి కానీ పలానా ఇంజనీరింగ్ పేరుతో కాదు అని తద్వార మీ ఆశయ సాధనతో జీవితం ఫలప్రదం అవుతుంది అని విద్యార్థులకు సూచించారు. మీ సంతకం ఆటోగ్రాఫ్‌గా మారితేనే విజయం సాధించినట్లు అని బల్ల గుద్దినట్లు తెలిపి ముగించారు. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల యాజమాన్యం, ఫార్మర్ రాజ్య సభ ఎంపి, కిట్స్ వరంగల్ చైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి, అదనపు కార్యదర్శి, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఫిజికల్ సైన్సెస్ విభాగం కార్యనిర్వాహక అధ్యాపక బృందంను, విద్యార్థి సమన్వయకర్తల బృందాన్ని జాతీయ సైన్స్ దేను నిర్వహించినందుకు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్‌లందరూ, వివిధ విభాగాల హెచ్ఓడీలు, హెడ్, ఐస్యోర్ ఆర్ఈ, ప్రొఫెసర్ కె. రాజనరేందర్ రెడ్డి, ఫిజికల్ సైన్సెస్ హెడ్ డాక్టర్ హెచ్. రమేష్ బాబు, ఎం అండ్ హెచ్ విభాగం హెడ్, డాక్టర్ కె. శివశంకర్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ డి. ప్రభాకర చారి, డాక్టర్ టి. మధుకర్ రెడ్డి, డాక్టర్ సిహెచ్. సతీష్ చంద్ర , ఫ్యాకల్టీ కోఆర్డినేటర్, డాక్టర్ ఇ. కళ్యాణ్ రావు, డాక్టర్ పి. శ్రీనివాస్ రావు, కిట్స్ వరంగల్ ఎన్ఎస్ఎస్ మరియు పీఎంసి విద్యార్థి ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది, 200 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.





# కోహ్లీ విధ్వంసానికి 13 ఏళ్లు!




2012 ఫిబ్రవరి 28న హెూబార్ట్‌లో జరిగిన భారత్-శ్రీలంక మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన 133 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. 321 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో కోహ్లీ కీలక పాత్ర పోషించాడు. మలింగా వంటి బౌలర్ల కు తన సత్తా చూపించాడు. ఈ మ్యాచ్ కోహ్లీ ఆడిన ఇన్నింగ్స్ వన్ ఆఫ్ ది బెస్ట్ ఇన్నింగ్స్ గా నిలిచిపోయింది. సరిగ్గా 13 ఏళ్ల క్రితం ఇదే రోజున, అంటే.. ఫిబ్రవరి 28, 2012లో ఇండియా -శ్రీలంక మ్యాచ్ మ్యాచ్ జరిగింది. ఆస్ట్రేలియాలోని హెూబర్ట్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్లో కుర్ర విరాట్ కోహ్లీ శివతాండవం చేశాడు. రామాయణంలో ఆంజనేయుడు లంకకు తన తోకతో మొత్తం నిప్పు అంటించాడని చదువుకున్నాం. అయితే ఇక్కడ మాత్రం విరాట్ కోహ్లీ తన బ్యాట్‌తో శ్రీలంకకు నిప్పుపెట్టేశాడు. ఆస్ట్రేలియా, ఇండియా, శ్రీలంక మధ్య కామన్‌వెల్త్ బ్యాంక్ సిరీస్ జరిగింది. ఒక్కో జట్టు మిగిలిన రెండు టీమ్స్‌తో తలో నాలుగు మ్యాచ్‌లు ఆడాలి. టీమిండియా ఆసీస్‌పై ఒక మ్యాచ్ గెలిచి మూడు ఓడింది. లంకపై ఒకటి ఓడింది, ఒకటి గెలిచింది, ఒక మ్యాచ్ టై అయింది. ఒక లంకతో ఒకే ఒక్క మ్యాచ్ మిగిలి ఉంది. ఆ మ్యాచ్‌లో గెలిస్తేనే టీమిండియా ఆ సిరీస్‌లో ఉంటుంది. అంటే తర్వాత ఆస్ట్రేలియా మూడు ఫైనల్స్‌లో తలపడే ఛాన్స్ సజీవంగా ఉంటుంది. అలాంటి ఎంతో కీలకమైన మ్యాచ్‌లో శ్రీలంక ముందుగా బ్యాటింగ్‌కు దిగి కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఏకంగా 320 పరుగుల భారీ స్కోర్ చేసింది. లంక ఓపెనర్ తిలకరత్నే దిల్షాన్ 160, కుమార సంగాక్కర 105 పరుగులతో చెలరేగారు. టీమిండియా ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉండేందుకు కేవలం మ్యాచ్ గెలిస్తే సరిపోదు.. 321 పరుగుల టార్గెట్ 40 ఓవర్లలోనే చేధించాలి. ఇంత క్లిష్ట పరిస్థితుల్లో టీమిండియా 86 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. సచిన్ టెండూల్కర్ 39 రన్స్ చేసి అవుట్ అయ్యాడు. అంతకంటే ముందు సెహ్వాగ్ 30 రన్స్ చేసి పెవిలియన్ చేరాడు. రెండో వికెట్ పడిన తర్వాత 23 ఏళ్ల కుర్ర విరాట్ కోహ్లీ క్రీజ్‌లోకి వచ్చాడు. అప్పటికే గంభీర్ క్రీజ్‌లో ఉన్నాడు. ఇద్దరూ కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించారు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ తన విశ్వరూపం చూపించాడు. అప్పటి వరకు కోహ్లీ అంటే బాగా ఆడతాడు అనే పేరుంది కానీ, ఆ ఇన్నింగ్స్‌లో అతని ఆట చూసి ప్రపంచ క్రికెట్ ఉలిక్కిపడింది. మలింగా అనే లంక బౌలర్ అప్పటికే ప్రపంచంలోని హేమాహేమీ బ్యాటర్లను వణికిస్తున్నాడు. మలింగ్ కెరీర్ మొత్తంలో ప్రైమ్ టైమ్ అంటే ఆ ఏడాది. అలాంటి టైమ్‌లో మలింగా కొట్టాడు కోహ్లీ.. అబ్బో అది మామూలు కొట్టుడు కాదు. కోహ్లీ దెబ్బకు ప్రపంచంలోనే బెస్ట్ ఫాస్ట్ బౌలర్‌గా ఉన్న మలింగా తన 10 ఓవర్ల కోటా కూడా పూర్తి చేయలేకపోయాడు. కేవలం 7.4 ఓవర్లలోనే ఏకంగా 96 పరుగులు సమర్పించుకున్నాడు. మరోవైపు విరాట్ కోహ్లీ కేవలం 86 బంతుల్లోనే 16 ఫోర్లు, 2 సిక్సులతో 133 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి.. టీమిండియా అద్భుతమైన విజయం అందించాడు. భారత క్రికెట్ చరిత్రలో అతి గొప్ప విజయాల్లో ఈ మ్యాచ్ గురించి కూడా చెప్పుకుంటారు. అలాగే కోహ్లీ కెరీర్‌లో ఇది వన్ ఆఫ్ ది బెస్ట్ ఇన్నింగ్స్‌గా నిలిచిపోయింది.


# ఆసీస్‌తో మ్యాచ్‌కు ముందు ఆఫ్ఘనిస్తాన్‌కు గుడ్ న్యూస్!




ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం యూనిస్ ఖాన్‌ను మెంటర్‌గా నియమించింది. అయితే, అతను పాకిస్తాన్ జట్టుతో పని చేయడాన్ని తిరస్కరించడం చర్చనీయాంశమైంది. అతని మార్గదర్శకత్వంలో ఆఫ్ఘనిస్తాన్ మరింత బలంగా తయారవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. క్రికెట్ ప్రపంచం ఆఫ్ఘనిస్తాన్ అద్భుత ప్రదర్శనను ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం తమ జట్టుకు మార్గదర్శకత్వం చేయడానికి పాకిస్తాన్ మాజీ కెప్టెన్ యూనిస్ ఖాన్‌ను మెంటర్‌గా నియమించింది. అయితే, యూనిస్ ఖాన్ ఇంతకుముందు పాకిస్తాన్ క్రికెట్ జట్టుతో కలిసి పనిచేయాలని నిరాకరించాడు అని మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ వెల్లడించాడు. లతీఫ్ మాట్లాడుతూ, యూనిస్ ఖాన్ ఆఫ్ఘనిస్తాన్ కోసం ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు లేకుండా పని చేయడానికి అంగీకరించాడని, కానీ అదే సమయంలో పాకిస్తాన్ క్రికెట్‌కు సహాయపడటాన్ని తిరస్కరించాడని తెలిపారు. ఛాంపియన్స్ ట్రోఫీ ఈసారి పాకిస్తాన్‌లో జరుగుతున్నందున, ఆతిథ్య దేశానికి సంబంధించిన ఒక అనుభవజ్ఞుడైన ఆటగాడిని మెంటర్‌గా తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుందని %ూజదీ% చీఫ్ ఎగ్జిక్యూటివ్ నసీబ్ ఖాన్ పేర్కొన్నారు. 2023 వన్డే ప్రపంచ కప్‌లో భారత మాజీ ఆటగాడు అజయ్ జడేజా ఆఫ్ఘనిస్తాన్‌కు మెంటర్‌గా ఉండగా, 2024 %ు%20 ప్రపంచ కప్‌లో వెస్టిండీస్ దిగ్గజం డ్వేన్ బ్రావో వారికి మార్గదర్శకత్వం చేశాడు. ఇంగ్లాండ్‌పై విజయంతో, ఆఫ్ఘనిస్తాన్ ఇప్పుడు ఆస్ట్రేలియాతో కీలకమైన మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. ఆ మ్యాచ్‌ను గెలిస్తే, ఇతర ఫలితాలపై ఆధారపడకుండా సెమీఫైనల్‌కు అర్హత సాధించగలదు. కోచ్ జోనాథన్ ట్రాట్ మాట్లాడుతూ, గత కొన్ని మ్యాచ్‌ల్లో ఆసీస్‌పై వారు మంచి పోటీ ఇచ్చిన కారణంగా, ఆ విజయం ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందని అన్నారు. “ఆస్ట్రేలియాతో మేము మూడుసార్లు ఆడాం, ప్రతి మ్యాచ్‌లో పోటీతత్వాన్ని చూపించాం. కాబట్టి, మనం ఆ అనుభవం నుంచి చాలా నేర్చుకోవాలి. ఇకపై ఏ జట్టూ ఆఫ్ఘనిస్తాన్‌ను తేలికగా తీసుకోబోదు” అని ట్రాట్ పేర్కొన్నారు. అతని మాటలు ఆఫ్ఘన్ జట్టు గెలుపుపై ఉత్సాహాన్ని పెంచాయి. ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్ ఛాంపియన్స్ ట్రోఫీలో మరో సంచలన విజయాన్ని నమోదు చేయగలదా అని అందరూ ఎదురు చూస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్ జట్టు గత కొన్ని సంవత్సరాల్లో అద్భుతమైన పురోగతి సాధించింది. ముఖ్యంగా, 2023 వన్డే ప్రపంచ కప్‌లో ఇంగ్లాండ్, పాకిస్తాన్, శ్రీలంక వంటి బలమైన జట్లను ఓడించడం ద్వారా వారు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఇప్పుడు, ఛాంపియన్స్ ట్రోఫీలోనూ అదే విజయం సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. యూనిస్ ఖాన్ మార్గదర్శకత్వంలో, ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్లు మరింత పటిష్టంగా తయారవుతున్నారు. ముఖ్యంగా రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ, ఫజల్హాక్ ఫరూఖీ వంటి ఆటగాళ్లు అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నారు. ఈ మ్యాచ్‌ల ద్వారా, వారు టాప్ జట్లతో పోటీపడగలరు అనే విశ్వాసాన్ని క్రికెట్ ప్రపంచానికి అందించారు.

# పాక్ బంగ్లా మ్యాచ్ వర్షార్పణం

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా పాకిస్థాన్‌బంగ్లాదేశ్ జట్ల మధ్య గురువారం జరగాల్సిన గ్రూప్‌ఎ మ్యాచ్ వర్షం వల్ల ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యింది. ఈ టోర్నమెంట్‌లో వర్షం వల్ల మ్యాచ్ పూర్తిగా రద్దు కావడం ఇది రెండోసారి. ఇంతకుముందు రావల్పిండిలోనే సౌతాఫ్రికాఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ కూడా వర్షార్పణం అయ్యింది. తాజాగా పాక్‌బంగ్లా మ్యాచ్ కూడా వరుణుడి బారిన పడి అర్ధాంతరంగా రద్దయ్యింది. ఈ మ్యాచ్‌లో కూడా టాస్ వేసే పరిస్థితి లేకుండా పోయింది. ఉదయం నుంచే రావల్పిండిలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో మైదానం మొత్తం చిత్తడిగా మారింది. మధ్యలో కొంత సేపు వర్షం తగ్గుముఖం పట్టినట్టు కనిపించింది. కానీ కొద్ది సేపటికే మళ్లీ జోరందుకుంది. చివరికి చేసేదేమీ లేకుండా అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మ్యాచ్ రద్దు కావడంతో ఇరు జట్లకు చెరో పాయింట్ లభించింది. కాగా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు ఇంతకుముందే సెమీ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించాయి. రెండు జట్లు భారత్, న్యూజిలాండ్‌లతో జరిగిన మ్యాచుల్లో ఓ టమి చవిచూశాయి. దీంతో టోర్నీ నుంచి వైదొలగక తప్పలేదు. కాగా, ఈ మ్యాచ్‌లో గెలిచి కాస్తయినా పరువును కాపాడుకోవాలని భావించిన ఆతిథ్యపాకిస్థాన్‌కు నిరాశే మిగిలింది.



# కొత్త క్లబ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన స్టార్ ఆల్ రౌండర్!



జింబాబ్వే స్టార్ సీన్ విలియమ్స్ వన్డే క్రికెట్‌లో 20 సంవత్సరాలు పూర్తి చేసి, ఎలైట్ జాబితాలో చేరాడు. అతను 162 వన్డేల్లో 5,140 పరుగులు, 85 వికెట్లు సాధించాడు. 2027 ప్రపంచ కప్‌కు అతని ప్రాతినిధ్యం ఇంకా స్పష్టంగా లేకపోయినా, అభిమానులు అతన్ని మరోసారి పెద్ద వేదికపై చూడాలని ఆశిస్తున్నారు. విలియమ్స్ తన అనుభవంతో జింబాబ్వే జట్టుకు కీలక బలంగా మారాడు. క్రికెట్ ప్రపంచం ప్రతిభకు ఎప్పుడూ కొదవ లేదు. సంవత్సరాలుగా, క్రికెట్ ప్రపంచం అనేక మంది క్రికెట్ దిగ్గజాలను చూసింది, వారి సుదీర్ఘ విజయవంతమైన కెరీర్ కొత్త తరం క్రికెటర్లకు స్ఫూర్తినిచ్చింది. సచిన్ టెండూల్కర్, సనత్ జయసూర్య, జావేద్ మియాందాద్ వంటి క్రికెటర్లు 20 సంవత్సరాలకు పైగా 50 ఓవర్ల ఫార్మాట్ ఆడటం ద్వారా క్రికెట్ చరిత్రలో తమ పేర్లను లిఖించుకున్నారు. ఇప్పుడు, జింబాబ్వే స్టార్ సీన్ విలియమ్స్ 50 ఓవర్ల ఫార్మాట్‌లో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎలైట్ క్లబ్‌లో చేరాడు. క్రికెట్ దిగ్గజాల జాబితాలో సీన్ విలియమ్స్ తన పేరును నమోదు చేసుకున్నాడు. జవేద్ మియాందాద్, సనత్ జయసూర్య , సచిన్ టెండూల్కర్ వన్డే ఫార్మాట్‌లో మరపురాని ముద్ర వేసిన క్రికెట్ దిగ్గజాలు, ప్రతి ఒక్కరూ 20 సంవత్సరాలుగా అద్భుతమైన ఆటగాళ్ళుగా ఆడుతున్నారు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తర్వాత జింబాబ్వే స్టార్ సీన్ విలియమ్స్ ఈ ఎలైట్ జాబితాలో చేరడంతో ఇప్పుడు ఈ జాబితా పెద్దదిగా మారింది. సచిన్ టెండూల్కర్ 22 సంవత్సరాలు వన్డేలు ఆడి 463 మ్యాచ్‌లు ఆడాడు. జయసూర్య తన 21 సంవత్సరాల వన్డే కెరీర్‌లో 445 మ్యాచ్‌లు ఆడాడు. జావేద్ మియాందాద్ తన 20 సంవత్సరాల వన్డే కెరీర్‌లో 233 వన్డేలు ఆడాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో 20 సంవత్సరాలు పూర్తి చేసిన తర్వాత, సీన్ విలియమ్స్ ఈ ఎలైట్ జాబితాలో కొత్త సభ్యుడు. 2005 ఫిబ్రవరి 25న జింబాబ్వే తరఫున సీన్ విలియమ్స్ వన్డే అరంగేట్రం చేశాడు. ఫిబ్రవరి 25, 2025న, అతను వన్డే ఫార్మాట్‌లో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాడు. ఇది అతని కెరీర్‌లో అద్భుతమైన మైలురాయి. 162 వన్డేల్లో, ఆల్ రౌండర్ 5,140 పరుగులు, 85 వికెట్లు సాధించాడు. దానితో, అతను సంవత్సరాలుగా జట్టులో కీలక సభ్యుడయ్యాడు. 20 సంవత్సరాల పాటు ఒకే ఫార్మాట్‌లో జట్టు కోసం అద్భుతమైన ప్రదర్శనలు ఇవ్వడం చిన్న విషయం కాదు మరియు సీన్ విలియమ్స్ ఈ మైలురాయిని పూర్తి వైభవంతో సాధించాడు. ప్రతిభ, కృషి మరియు పూర్తి మక్కువతో, ఆల్ రౌండర్ ప్రపంచ వేదికపై దేశానికి సేవ చేశాడు.

# రెండోరోజు రాణించిన కేరళ బౌలర్లు




రంజీట్రోఫీ ఫైనల్లో రెండోరోజు కేరళ బౌలర్లు సమిష్టిగా రాణించారు. తొలిరోజు కేవలం 4 వికెట్లను మాత్రమే చేజిక్కించుకున్న కేరళ బౌలర్లు.. రెండోరోజే ఏకంగా 6వికెట్లను పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 254పరుగులతో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భను కేరళ బౌలర్లు కళ్లెం వేశారు. మరో 125పరుగులకే చివరి ఐదు వికెట్లను పడగొట్టారు. దీంతో విదర్భ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 379పరుగులకే ఆలౌటైంది. కేరళ బౌలర్లు నిదీశ్, ఈడెన్ ఆప్లేకు మూడేసి, బసిల్‌కు రెండు, సక్సేనాకు ఒక వికెట్ దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కేరళ జట్టు రెండోరోజు ఆట ముగిసేసరికి మూడు వికెట్ల నష్టానికి 131పరుగులు చేసింది. అక్షరు(14), కున్నుమ్మల్(0) నిరాశపరచగా.. ఆదిత్య(68నాటౌట్), ఇమ్రాన్(37) బ్యాటింగ్‌లో రాణించారు. క్రీజ్‌లో ఆదిత్యకు తోడు కెప్టెన్ సచిన్ బేబి(7) ఉన్నారు. విదర్భ బౌలర్లు నల్కేండేకు రెండు, యశ్ఠాకూర్‌కు ఒక వికెట్ దక్కాయి.

# సత్తా చాటిన గుజరాత్ బౌలర్లు

గుజరాత్ జెయింట్స్ బౌలర్లు తొలిసారి మహిళల ప్రిమియర్ లీగ్‌లో సత్తా చాటారు. చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరుతో మహిళలతో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ బౌలర్లు రాణించి బెంగళూరు బ్యాటర్లను కట్టడి చేశారు. కెప్టెన్ మంధాన, ఎలైసే పెర్రి, రీచా ఘోష్ స్వల్ప స్కోర్‌లకే పరిమితం కావడంతో బెంగళూరు జట్టు నిర్ణీత ఓవర్లలో 125పరుగులే చేయగల్గింది. గుజరాత్ జెయింట్స్ బౌలర్లు కశ్వీ గౌతమ్, తనూజ కన్వార్, గార్డినర్, డోటిన్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఆ లక్ష్యాన్ని గుజరాత్ అవలీలగా %౨% ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ గార్డినర్(58) అర్ధసెంచరీకి తోడు లిచ్‌ఫీల్ బ్యాటింగ్‌లో రాణించారు. బెంగళూరు బౌలర్లు రేణుక సింగ్, వారేహామ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ మరో చెత్త ప్రదర్శన చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. కెప్టెన్ స్మృతి మంధన 20 బంతుల్లో 10, ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న ఎల్లిస్ పెర్రీ 4 బంతులు ఎదుర్కొని డకౌటైంది. ఓపెనర్ వ్యాట్ హాడ్జ్ 4, రిచా ఘోష్ 9 పరుగులకు ఔటయ్యారు. కనిక అహూజా (28 బంతుల్లో 33), రాఘ్వి బిస్త్ (22), జార్జియా వేర్హామ్ (20 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేయడంతో ఆర్సీబీ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ఆఖర్లో కిమ్ గార్త్ (14) రెండంకెల స్కోర్ చేసింది. స్నే%ఎ%్హ రాణా ఒక పరు గుతో అజేయంగా నిలిచింది. దీంతో బెంగ ళూరు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరు గులు మాత్రమే చేయగలిగింది. గుజరాత్ బౌలర్లలో కశ్వీ గౌతమ్ (1/17) అద్భుత ప్రదర్శనకు తోడు తనూజా, డోటిన్ రెండేసి వికెట్లతో సత్తా చాటారు.



జై భీమ్
POWER OF PEOPLE

# 3న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న 97వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవం మార్చి 2న (భారత కాలమానం ప్రకారం మార్చి 3న) అమెరికాలోని లాస్ఏంజెల్స్‌లో జరగనుంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పురస్కారాన్ని సొంతం చేసుకోవటానికి పలువురు నటీనటులు, దర్శకులు పోటీపడ్డారు. 1968 తర్వాత సంగీత నేపథ్యం ఉన్న రెండు సినిమాలు వికెడ్, ఎమిలియా పెరెజ్ ఆస్కార్‌కు నామినేట్ అయ్యాయి. ఆస్కార్ చరిత్రలో రెండు మ్యూజికల్ బ్యాక్‌డ్రాప్ ఉన్న చిత్రాలు 10 లేదా అంత కంటే ఎక్కువ కేటగిరీల్లో నామినేట్ కావటం ఇది రెండోసారి. మొత్తం నామినేషన్లలో రేసులో ఎమిలియా పెరెజ్ 13 విభాగాల్లో ముందంజలో ఉంది. ఉత్తమ దర్శకుడు, రచనా విభాగంలో నామినేట్ కాకుండా 10 కేటగిరీల్లో నామినేషన్లు అందుకున్న మొదటి చిత్రంగా వికెడ్ రికార్డు సృష్టించింది. ఎమిలియా పెరెజ్ సినిమాను జాక్వెస్ ఆడియార్డ్ తెరకెక్కించారు. పరిస్థితుల కారణంగా ట్రాన్స్‌జెండర్‌గా మారిన ఓ డ్రగ్స్ లార్డ్ అనుభవాల్ని తెరపై కళ్లకు కట్టినట్లుగా చూపించటంలో ఆయన విజయవంతం కావటంతో దర్శకుడి విభాగంలో ఆయన నామినేట్ అయ్యారు. హాలీవుడ్ నటి కర్లా సోఫియాగాస్కాన్ ఉత్తమ నటిగా నామినేషన్ దక్కించుకున్నారు. అండర్ వరల్డ్ డ్రగ్స్ నేపథ్యంలో సాగే 'ఎమిలియా పెరెజ్' చిత్రానికిగాను ఆమె ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ ఏడాది ఆస్కార్ బరిలో నిలిచిన మొదటి ట్రాన్స్‌జెండర్ కూడా ఆమె. ఫెర్నాండా టోర్రెస్ నటించిన ఐయామ్ స్టిల్ హియర్ నామినేషన్ దక్కించుకున్నారు. ఫెర్నాండా టోర్రెస్ కూడా పోటీపడుతున్నారు. ఉత్తమ సహాయనటుడి విభాగంలో కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), జెరీమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ఇదే మొట్టమొదటి ఆస్కార్ నామినేషన్.

## మనసు మార్చుకుంటున్న వీరమల్లు ?



ఫిబ్రవరి నెల అయిపోయింది. మార్చిలోకి అడుగుపెట్టబోతున్నాం. ముందు నుంచి చెబుతూ వచ్చిన ప్రకారమైతే హరిహర వీరమల్లు విడుదలకు ఇంకో 27 రోజులు మాత్రమే ఉంది. ఇంకొంత షూట్ బాలన్స్ ఉందని టాక్. పవన్ కళ్యాణ్ మరో నాలుగైదు రోజులు డేట్స్ ఇస్తే అయిపోతుందట. కానీ ఆరోగ్యం, అసెంబ్లీ సమావేశాలు తదితర కారణాలు స్పీడ్ బ్రేకర్స్ లా మారాయి. ఈ నేపథ్యంలో ఇచ్చిన మాట ప్రకారం వీరమల్లు రావడం అనుమానంగానే ఉంది. అందుకే మార్చ్ 28, 29 రావాలని ఫిక్సయిపోయిన నితిన్ రాబిన్ హుడ్, సితార సంస్థ మ్యాడ్ స్క్వేర్ రెండూ ప్రమోషన్ల వేగాన్ని అమాంతం పెంచే పనిలో పడ్డాయి. ఒకవేళ వీరమల్లు వాయిదా తప్పని పక్షంలో ఏప్రిల్ 11, 18 రెండు తేదీలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. అనుష్క ఘాటీ కనక మూడో వారం నుంచి తప్పుకుంటే ఆ డేట్ సానుకూలంగా ఉంటుంది. కానీ ప్రస్తుతానికి యువి క్రియేషన్స్, దర్శకుడు క్రిష్ పోస్ట్ పోన్ గురించి ఎలాంటి సూచనలు ఇవ్వడం లేదు. నిర్ణయం మార్పు లేదనే తరహాలోనే సంకేతం ఇస్తున్నారు. ఒకవేళ పదకొండు అనుకుంటే కేవలం రెండు వారాల సమయం సరిపోతుందా అంటే ఠక్కున చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటిదాకా టీజర్, రెండు లిరికల్ వీడియోస్ మాత్రమే వచ్చాయి. అసలైన ట్రైలర్ ఎప్పుడు వస్తుందో క్లారిటీ లేదు. సో ఏదో ఒకటి నిర్మాత ఏఎం రత్నం టీమ్ నుంచి అఫీషియల్ నోట్ రావడం అవసరం. ఒకవేళ మార్చి 28 అనుకుంటే పబ్లిసిటీ ప్లాన్ మార్చుకోవాలి. లేదంటే మారిన సంగతిని ప్రకటించాలి. హైప్ విషయంలో ఇంకా వెనుకబడే ఉన్న హరిహర వీరమల్లు ఓపెనింగ్స్ పరంగా ఫ్యాన్స్, జనసేన వర్గాల నుంచి మద్దతు పుష్కలంగా ఉంటుంది.

## 'కూలీ' చూశా.. వెయ్యి కోట్లు గ్యారెంటీ



లోకేష్ కనకరాజ్.. ఇప్పుడు ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో అత్యంత డిమాండ్ ఉన్న దర్శకుల్లో ఒకడు. ఖైదీ, విక్రమ్ చిత్రాలతో అతను ఎంత క్రేజ్ సంపాదించుకున్నాడో తెలిసిందే. ముఖ్యంగా తాను తీసిన ప్రతి సినిమాకూ ఒక లిక్ పెడుతూ అతను క్రియేట్ చేసిన లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ ఎంత పెద్ద ట్రెండ్‌గా మారిందో తెలిసిందే. ఐతే ఇప్పుడింత క్రేజ్ సంపాదించుకున్న లోకేష్.. తాను తీసిన తొలి చిత్రంలో మన యంగ్ హీరో సందీప్ కిషన్‌నే లీడ్ రోల్‌లో పెట్టాడు. ఆ చిత్రమే.. మానగరం. ఆ సినిమా సక్సెస్ అయింది. ఐతే 'మానగరం' తర్వాత సందీప్.. లోకేష్‌తో కలిసి సినిమానే చేయలేదు. ఎల్సీయూలో భాగమైన మరే చిత్రంలోనూ కనిపించలేదు. సందీప్‌తో తొలి సినిమా చేసిన లోకేష్ ఇంత పెద్ద దర్శకుడు అయిపోవడం.. మళ్లీ తనతో సందీప్ జట్టు కట్టకపోవడం గురించి తన కొత్త చిత్రం 'మజాకా' సక్సెస్ మీట్లో విలేకరులు ప్రస్తావిస్తే.. సందీప్ కిషన్ దాని గురించి స్పందించాడు. లోకేష్‌తో తాను ఇప్పటికీ టచ్‌లో ఉన్నానని.. మళ్లీ తామిద్దరం కలిసి చేస్తే అది తనకు, అతడికి బెస్ట్ మూవీ అయ్యుండాలనే ఉద్దేశంతో మళ్లీ సినిమా చేయలేదన్నాడు. తాను లోకేష్‌తో మళ్లీ సినిమా చేయబోతున్నానని.. అది ఎల్సీయూలో భాగమా కాదా అని తాను చెప్పలేనని సందీప్ అన్నాడు. మరోవైపు లోకేష్ డైరెక్ట్ చేస్తున్న కొత్త చిత్రం 'కూలీ' గురించి సందీప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ సినిమా సెట్స్‌కు తాను వెళ్లానని.. అంతే కాక దాదాపు ముప్పావు గంట సినిమా చూశానని.. ఈ సినిమా వెయ్యి కోట్ల వసూళ్లు సాధించడం గ్యారెంటీ అని సందీప్ చెప్పడం విశేషం.

## కళ్యాణ్ రామ్ 21 ఆలస్యానికి కారణమేంటి



నందమూరి కళ్యాణ్ రామ్ తెర మీద కనిపించి ఏడాది దాటేసింది. 2023 డిసెంబర్ లో డెవిల్ రిలీజయ్యాక మళ్ళీ దర్శనం లేదు. దీంతో పాటు అదే ఏడాది అమిగోస్ రూపంలో మొత్తం రెండు ఫ్లాపులు చవి చూసి కొంత బ్రేక్ తీసుకున్నాడు. అయితే తన ఇరవై ఒకటవ సినిమా మీద మంచి అంచనాలే నెలకొన్నాయి. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్ టైనర్ సంవత్సరానికి పైగానే నిర్మాణంలో ఉంది. పలు టైటిల్స్ ప్రచారంలోకి వచ్చాయి. మెరుపు, రుద్ర అంటూ ఫిలిం నగర్ లో మాట్లాడుకున్నారు కానీ ఫైనల్ గా ఏది ఫిక్స్ చేస్తారనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు. షూట్ చివరి దశకు చేరుకుంది. మేజర్ ఫేమ్ సయీ మంజ్రేకర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలో మరో ప్రధాన ఆకర్షణ సీనియర్ హీరోయిన్ విజయశాంతి. సరిలేరు నీకెవ్వరు తర్వాత ఎట్టి పరిస్థితుల్లో నటించను అని చెప్పిన రాములమ్మ ఈ కళ్యాణ్ రామ్ కథ విపరీతంగా నచ్చడం వల్ల ఓకే చెప్పారు. పైగా కర్తవ్యం పోలీస్ ఆఫీసర్ వైజయంతి పాత్రని రీ క్రియేట్ చేయడంతో ప్రత్యేక అంచనాలు నెలకొన్నాయి. విరూపాక్ష, మంగళవారం ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం సమకూర్చడం మరో అట్రాక్షన్. ఇన్ని ప్రత్యేకతలు ఉన్నప్పుడు సరైన రీతిలో ప్రమోషన్ చేసుకుంటే ఖచ్చితంగా అంచనాలు రేపొచ్చు. ఆలస్యానికి పలు కారణాలు వినిపిస్తున్నాయి. ఓటిటి డీల్ తో పాటు వేసవి మొత్తం పెద్ద సినిమాలతో రిలీజ్ డేట్లు లాకైపోవడంతో సరైన తేదీ కోసం చూస్తున్నారట. దేవరతో తమ్ముడు జూనియర్ ఎన్టీఆర్ బ్లాక్ బస్టర్ అందుకున్నాక అన్న కళ్యాణ్ రామ్ హిట్ కొట్టాలని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.

## సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు 'రెట్రో' రైట్స్



ప్రశంసలు పొందిన జాతీయ అవార్డు-విజేత నటుడు సూర్య నటించిన అత్యంత అంచనాల చిత్రం =జు=ా భారీ ప్రభావాన్ని చూపడానికి సిద్ధంగా ఉంది. పవర్ ఫుల్ టీజర్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం మే 1న విడుదలకు సిద్ధంగా ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తెలుగు థియేట్రికల్ రైట్స్‌ను సొంతం చేసుకోవడంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ అంచనాల మధ్య విడుదలవుతోంది. బ్లాక్‌బస్టర్ థియేట్రికల్ అనుభవాలను అందించడంలో ప్రసిద్ధి చెందిన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ లియో (తమిళం), దేవర (తెలుగు), మరియు బ్రహ్మయుగం (మలయాళం) వంటి చిత్రాలను పరిశ్రమల అంతటా విజయవంతంగా పంపిణీ చేసింది. ఇప్పుడు తెలుగులో రెట్రో రిలీజ్ చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో భారీ విడుదల గ్యారెంటీ, మరియు సూర్య తెలుగు అభిమానులు థియేటర్లలో రెట్రోను తదుపరి స్థాయిలో జరుపుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. దాని ఆకర్షణీయమైన ఆవరణ, నక్షత్ర తారాగణం మరియు కార్తీక్ సుబ్బరాజ్ యొక్క విలక్షణమైన దర్శకత్వ స్పర్శతో, ఈ చిత్రం ఎలక్ట్రిఫైయింగ్ రెట్రో రైడ్‌ను అందిస్తుందని హామీ ఇచ్చింది. ప్రతి కంటెంట్‌తో, =జు=ా సంవత్సరంలో అత్యంత ఎదురుచూస్తున్న విడుదలలలో ఒకటిగా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో పూజా హెగ్డే, జోజు జార్జ్, జయరామ్, నాజర్ మరియు ప్రకాష్ రాజ్ కీలక పాత్రలలో నటించారు.

## గేరు మార్చే టైం వచ్చేసింది

మంచు విష్ణు హీరోగా రూపొందుతున్న భారీ ప్యాన్ ఇండియా మూవీ కన్నప్ప ప్రమోషన్లలో వేగం పెంచారు. నిన్న ముంబైలో జరిగిన టీజర్ లాంచ్ బాగానే జరిగింది. కానీ బజ్ విషయంలో కన్నప్ప గేరు మార్చాల్సిన టైం వచ్చేసిందని చెప్పాలి. ఎందుకంటే విడుదల తేదీ ఏప్రిల్ 25 కి ఇంకో 45 రోజుల టైం మాత్రమే ఉంది. పోస్ట్ ప్రొడక్షన్, ట్రైలర్ లాంచ్, ఈవెంట్లు, ఇంటర్వ్యూలు, మీడియా ఇంటరాక్షన్లు అన్నీ ఇందులోనే అయిపోవాలి. ప్రభాస్ లాంటి పెద్ద స్టార్ క్యామియో చేస్తే ఈపాటికి అంచనాలు ఆకాశాన్ని దాటాలి. కానీ పబ్లిసిటీ కంటెంట్ లో ఆశించిన క్వాలిటీ లేకపోవడం వల్లే హైప్ రావడం లేదన్నది ఓపెన్ కామెంట్. దీని మీద విష్ణు దృష్టి పెట్టాలి. ఎంత భక్తి భరిత సినిమా అయినప్పటికీ కన్నప్పలో ఆబాలగోపాలాన్ని అలరించే అంశాలకు కొదవ లేదు. వాటిని సరైన రీతిలో ప్రేక్షకుల మెదళ్లలో రిజిస్టర్ చేయాలి. కథ రివీల్ అవుతుందేమోననే భయం అక్కర్లేదు. ఎందుకంటే కన్నప్పది అందరికీ తెలిసిన గాథే. కృష్ణంరాజుగారి భక్త కన్నప్ప చూసినా ఆయన గొప్పదనం గురించి పూర్తి అవగాహన వచ్చేస్తుంది. అలాంటప్పుడు స్టోరీ లీక్స్ లాంటి ఇబ్బంది లేదు. పైగా పాత వెర్షన్ లో లేని చాలా మార్పులు ఇందులో పొందుపరిచామని విష్ణు పలు సందర్భాల్లో చెబుతూ వచ్చాడు. సో కొత్తగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభాస్, మోహన్ లాల్, మోహన్ బాబు, అక్షయ్ కుమార్ లాంటి దిగ్గజాలు నటించిన కన్నప్పకు నార్త్ మార్కెట్ చాలా ముఖ్యం. అసలే ఈ ఏడాది కుంభమేళా జరిగింది. జనాలు ఆధ్యాత్మిక చింతనలో ఉన్నారు. కన్నప్ప లాంటి సినిమాలకు ఇదే మంచి టైం. ఆడియన్స్ మూడ్ ని సరిగ్గా కనెక్ట్ చేసుకోగలిగితే థియేటర్లకు వచ్చేస్తారు.



## కల్ట్ దర్శకుడి మాటలు నమ్మొచ్చా

ఒక స్టార్ హీరో సినిమా ఏడేళ్లు ల్యాబ్ లో మగ్గి రిలీజ్ కోసం అష్టకష్టాలు పడటం అరుదు. కానీ 2017 నుంచి ధృవ నచ్చత్తిరమ్ ఈ పాట్లు పడుతూనే ఉంది. గౌతమ్ మీనన్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ త్వరలోనే విడుదలవుతుందని, సంక్రాంతికి రిలీజై సెన్సేషనల్ హిట్టు కొట్టిన మదగజరాజా తరహాలో తాము కూడా విజయం సాధించడం ఖాయమని ఇటీవలే పలు సందర్భాల్లో చెప్పుకుంటూ వచ్చారు. తాజాగా మే 1 రావొచ్చని లీక్ ఇచ్చారు. అయితే నిజంగా వస్తుందా అంటే ఎవరూ నమ్మడం లేదు. నేరుగా జోక్ చేయకండి గౌతమ్ గారూ అంటూ కామెడీ చేస్తున్నారు. దీనికి కారణాలు లేకపోలేదు. విక్రమ్ ఈ సినిమాను పట్టించుకోవడం ఎప్పుడో మానేశాడు. కనీసం ఎక్కడైనా బయట మీడియాకు కనిపించినప్పుడు ప్రస్తావించే చొరవ తీసుకోవడం లేదు. గౌతమ్ మీనన్ మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా ధృవ నచ్చత్తిరమ్ చుట్టుముట్టిన ఆర్థిక ఇబ్బందులను తొలగించేందుకు నానా యాతన పడుతున్నారు. నటనకు ప్రాధాన్యం ఇస్తూ వీలైనంత ఎక్కువ పాత్రలు చేస్తూ డబ్బును పోగేసే పనిలో పడ్డారు. ఆయన కోరికకు తగ్గట్టు బిజీ ఆర్టిస్టుగా మారిపోయారు. కానీ ధృవ నచ్చత్తిరమ్ బయటికి రావడం మాత్రం అంతకంతా దుర్లభంగా మారిపోయింది. ట్విస్ట్ ఏంటంటే ఇది రెండు భాగాల మూవీ. పెళ్లి చూపులు, మజాకా ఫేమ్ రీతూ వర్మ హీరోయిన్ గా నటించిన ఈ సినిమాకు హారిస్ జైరాజ్ సంగీతం సమకూర్చారు. దేశ విదేశాలలో చిత్రీకరణ జరిపారు. యాక్షన్ ఎపిసోడ్స్ కోసం విక్రమ్ చాలా రిస్క్ తీసుకోవాల్సి వచ్చింది. ఇంకో ట్విస్ట్ ఏంటంటే గౌతమ్ మీనన్ ధృవ నచ్చత్తిరమ్ ని మే 1 తీసుకొచ్చేందుకు ట్రై చేయడం బాగానే ఉంది.

